


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 08 అక్టోబరు 2021 | సంపుటి : 03 | సంచిక : 58 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : జగన్






ఒంగోలు, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)మహిళ రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను సంక్షేమ పథకాల ద్వారా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెల్లడించారు. చేయూత కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని.. నాలుగేళ్ల పాటు ప్రతీ ఏడాది మహిళలకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఒంగోలులో వైఎస్సార్ ఆసరా పథకం రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం.. కడప జిల్లా మినహా రాష్ట్రమంతా ఇవాళ్టి నుంచి ఈ నెల 18 వరకు డ్వాక్రా మహిళల అకౌంట్లలోకి డబ్బులు జమ కానున్నాయని స్పష్టం చేశారు. రెండో విడత సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఖాతాల్లోకి రూ. 6439.52 కోట్లు జమ చేస్తున్నామని సీఎం అన్నారు. 4 విడతల్లో మొత్తంగా రూ. 25,512 కోట్లు జమ చేస్తామని ప్రకటించారు. అటు కడప జిల్లాలో నవంబర్ 6 నుంచి 15 వరకు ఆసరా పథకం అమలు చేస్తామని క్లారిటీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం జగన్ పొదుపు సంఘాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. గత ప్రభుత్వం హయాంలో పొదుపు సంఘాలు నిర్వీర్యమైపోయాయన్నారు. రుణ మాఫీ చేస్తామని చెప్పి డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశారని.. తమ ప్రభుత్వమే తిరిగి ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం సహకారం డ్వాక్రా సంఘాలు తిరిగి నిలబడ్డాయన్నారు. పంచాయతీ, మున్సిపల్, జిల్లా పరిషత్, తిరుపతి ఉప ఎన్నికల వరకు తమకు దక్కిన ప్రజా ఆదరణ మరువలేనిదని సీఎం వైఎస్ జగన్ అన్నారు.పథకం ద్వారా కోటి మంది మహిళలకు రూ. 2,300 కోట్ల రూపాయలు చెల్లుస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. అలాగే జగనన్న అమ్మఒడి పథకం ద్వారా 44.50 లక్షల తల్లులకు, 85 లక్షల పిల్లలకు రూ. 6,500 కోట్ల చొప్పున రూ. 13,025 వేల కోట్ల రూపాయలు అందించామన్నారు. గతంలో 39 లక్షల మందికి పెన్షన్లు ఇస్తే ఇప్పుడు 61 లక్షల మందికి రూ. 2,250 రూపాయల చొప్పున నెలకు రూ. 14 వేల కోట్లు జమ చేస్తున్నామని సీఎం అన్నారు. అటు ఆసరా పథకం ద్వారా 78.76 లక్షల మంది మహిళలకు రూ. 12,758 కోట్లు రెండు విడతలుగా.. చేయూత ద్వారా ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ మహిళలకు రెండు విడతలుగా రూ. 8,944 వేల కోట్లు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని నాలుగోవంతు ప్రజలకు ఇళ్ళస్థలాలను అందించామని.. ఇళ్ళ నిర్మాణం కోసం నేరుగా మహిళల ఖాతాల్లో 5 లక్షలు జమ చేశామన్నారు.జగనన్న విద్యాదీవెన, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ ద్వారా 18.21 వేల మంది తల్లులకు 5,500 వేల కోట్ల రూపాయలు.. వసతి దీవెన ద్వారా 15.58 వేల మంది పిల్లల కోసం నేరుగా 2,270 కోట్ల రూపాయలు చెల్లుస్తున్నామని సీఎం జగన్ స్పష్టం చేశారు. పంచాయతీ, మున్సిపల్, జిల్లా పరిషత్, తిరుపతి ఉప ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని.. వారికి ఎంత చేసినా తక్కువేనని సీఎం జగన్ అన్నారు.మరోవైపు దేశ చరిత్రలోనే తొలిసారిగా నామినేటెడ్ పదువులు, కాంట్రాక్టులు మహిళలకు దక్కేలా శాసనసభలో చట్టం తీసుకొచ్చామన్నారు సీఎం జగన్. హోంమంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా మహిళలకు స్థానం కల్పించాం. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా చరిత్రలో తొలిసారిగా ఒక మహిళను నియమించాం. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో 52 శాతం మహిళలకు అవకాశం ఇచ్చాం. జడ్పి ఛైర్మన్‌లుగా 13 స్థానాల్లో 7 స్థానాల్లో మహిళలకు అవకాశం ఇచ్చాం. ప్రకాశం జిల్లా జడ్పి ఛైర్మన్‌గా మహిళను చేశాం. 26 వైస్ ఛైర్మన్లు ఉంటే 15 మంది మహిళలకు అవకాశం ఇచ్చాం.

## ఆసుపత్రుల సామర్థ్యం మరింత పెరిగింది : మోదీ



న్యూఢిల్లీ : మన దేశంలో ఆసుపత్రుల సామర్థ్యం మరింత పెరిగిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పీఎం కేర్స్ నిధి క్రింద కొత్తగా 4,000 ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని హృషీకేశ్‌లో ఉన్న అఖిల భారత వైద్య, విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)లో గురువారం జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 35 పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్లను ప్రారంభించారు. పీఎం కేర్స్ నిధి క్రింద రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 35 ప్రెజర్ స్వింగ్ అడ్‌సార్ప్షన్ (పీఎస్ఏ) ఆక్సిజన్ ప్లాంట్లను మోదీ ప్రారంభించారు. కోవిడ్-19 మహమ్మారిపై పోరాడేందుకు భారత దేశం అతి తక్కువ సమయంలో సదుపాయాలను కల్పించిందని, ఇది దేశ సామర్థ్యాన్ని వెల్లడిస్తోందని మోదీ అన్నారు. దేశంలో టెస్టింగ్ ల్యాబ్‌ల సంఖ్య ఒకటి నుంచి 3,000కు పెరిగిందని, మాస్కులు, కిట్లను దిగుమతి చేసుకునే దశ నుంచి వాటిని తయారు చేసే స్థాయికి ఎదిగామని, ఎగుమతిదారుగా వేగంగా దూసుకెళ్తున్నామని చెప్పారు. దేశంలోని అన్ని జిల్లాల్లోనూ పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటవుతాయని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు పీఎం కేర్స్ నిధి క్రింద 1,224 పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయని పేర్కొంది. వీటిలో 1,100 ప్లాంట్లు ప్రారంభమయ్యాయని, రోజుకు 1,750 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను అందజేస్తున్నాయని తెలిపింది.

## పాముకాటుతో చంపించడం ఓ ట్రెండ్ అయ్యింది.. బెయిల్ ఇవ్వలేం..!



దిల్లీ: ప్రమాదవశాత్తూ పాము కాటుతో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు దేశంలో చాలా చోట్ల జరుగుతాయి. అయితే ఉద్దేశపూర్వకంగా హత్య చేయడం కోసం పామును ఆయుధంగా వాడుకోవడం క్రూరమైన నేరం అని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తోందని రాజస్థాన్‌కు చెందిన ఓ మహిళ తన అత్తను పాము కాటుతో చంపించిన ఘటనలో నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "పాములు ఆడించేవారి నుంచి విషపూరితమైన పాములను తీసుకొచ్చి వ్యక్తులను చంపించడం, పాము కాటుతో ప్రమాదవశాత్తూ చనిపోయిందని నమ్మించడం ఇప్పుడో కొత్త ట్రెండ్ అయిపోయింది. రాజస్థాన్‌లో ఇలాంటి నేరాలు తరచూ జరుగుతున్నాయి. ఈ కేసులో నిందితులకు బెయిల్ ఇవ్వడం కుదరదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. 2019లో ఈ ఘటన చోటుచేసుకుంది. రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాకు చెందిన అల్పనకు సైన్యంలో పనిచేస్తున్న వ్యక్తితో వివాహం జరిగింది. విధుల రీత్యా అల్పన భర్త దూరంగా ఉండటంతో ఆమె ఝుంఝునులో అత్త సుబోధ్ దేవితో కలిసి నివసిస్తోంది. సుబోధ్ దేవి భర్త కూడా ఉద్యోగ రీత్యా మరో ప్రాంతంలో ఉండేవారు. ఈ క్రమంలోనే అల్పనకు జైపుర్‌కు చెందిన మనీశ్‌కు పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారితీసింది. అల్పన, మనీశ్ తరచూ ఫోన్లో మాట్లాడుకుంటూ ఉండటంతో అనుమానం వచ్చిన సుబోధ్ దేవి కోడలిని నిలదీసింది. దీంతో తమ ప్రేమకు అడ్డువస్తుందని భావించిన అల్పన.. అత్తను చంపేందుకు ప్రియుడు, అతడి స్నేహితుడితో కలిసి కుట్ర చేసింది. మనీశ్ సాయంతో పాములు పట్టేవాడి నుంచి ఓ విషపూరిత పామును తీసుకొచ్చింది. అత్త పడుకున్న తర్వాత పామును మంచం కింద వదిలింది. నిద్రలో ఉన్న సుబోధ్ దేవిని పాము కాటువేయడంతో కన్నుమూసింది. ఆ తర్వాత పాము కాటుతో తన అత్త మరణించినట్లు బంధువులను నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే అనుమానం వచ్చిన అల్పన అత్తింటి వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అల్పన, ఆమె ప్రియుడు, మరో వ్యక్తిని 2020లో పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ కోసం వారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం అందుకు తిరస్కరించింది.

## సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం




ప్రకాశం జిల్లా: తాడేపల్లి నుంచి ఒంగోలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీ (పీటీసీ)లో హెలికాప్టర్ దిగిన దగ్గర నుంచి పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం వరకు దారి పొడవునా మహిళలు, పార్టీ శ్రేణులు సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికారు. సీఎం వచ్చే దారితోపాటు, ఒంగోలు నగరం మొత్తం భారీ స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఒంగోలు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా సభా వేదిక వద్దకు చేరుకున్న సీఎం.. అక్కడ పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం వేదిక వద్ద లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత తన ప్రసంగం అనంతరం వైఎస్సార్ ఆసరా రెండో విడత కింద లబ్ధిదారులకు డబ్బులు జమ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు'వైఎస్సార్ ఆసరా' పథకం రెండవ విడత మొత్తాన్ని ప్రభుత్వం నేడు డ్వాక్రా గ్రూపు సభ్యులైన మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో 2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట ఉన్న అప్పును నాలుగు విడతల్లో మహిళలకు అందజేసే ఈ పథకానికి సీఎం వైఎస్ జగన్ గత ఏడాది శ్రీకారం చుట్టి.. తొలి విడత సొమ్ము జమ చేసిన విషయం తెలిసిందే.ఇందులో భాగంగా గురువారం నుంచి రెండో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 7.97 లక్షల స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 78.76 లక్షల మంది మహిళలకు రూ.6,439.52 కోట్లు పంపిణీ ప్రారంభం కానుంది. ప్రకాశం జిల్లా ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి దాదాపు 20 వేల మంది లబ్ధిదారుల సమక్షంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. గత ఏడాది తొలి విడతగా చెల్లించిన రూ.6,318.76 కోట్లు కూడా కలిపితే పొదుపు సంఘాల అప్పునకు సంబంధించి రూ.12,758.28 కోట్లు మహిళలకు అందజేసినట్టవుతుంది.

## క్యూలైన్‌లో వెళ్లి దుర్గమ్మను దర్శించుకున్న దేవినేని ఉమ

విజయవాడ : ఇంద్రకీలాద్రి పైనున్న దుర్గమ్మను సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్యూలైన్‌లో గ్రావెల్ సరిగా వేయలేదన్నారు. క్యూలైన్‌లో బైండింగ్ వైర్లు అలాగే ఉన్నాయన్నారు. పారిశుధ్యం ఇంకా పెంచాలని.. ఎన్ని టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయో మీడియా ద్వారా తెలపాలని దేవినేని ఉమ డిమాండ్ చేశారు. అమ్మవారి ప్రాంగణంలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుడు సతీష్ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రతీ మూల నక్షత్రం నాడు సీఎం నిధులు



కేటాయించామని చెపుతారని.. ఆ నిధులు ఎంత మేర ఖర్చు చేసారో తెలపాలన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నానని దేవినేని ఉమ తెలిపారు.

## దేవుడు వర్షాలు కురిపిస్తుంటే.. జగనన్న సంక్షేమ పథకాలు ఇస్తున్నారు

ప్రకాశం జిల్లా: దేవుడు వర్షాలు కురిపిస్తుంటే.. జగనన్న సంక్షేమ పథకాలు ఇస్తున్నారని డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రెండో విడత 'వైఎస్సార్ ఆసరా' కార్యక్రమంలో లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళ స్వాతి మాట్లాడుతూ, సీఎం జగనన్న ఇచ్చిన మాటనిలబెట్టుకున్నారని.. అర్హత ఉన్న ప్రతి మహిళకు సంక్షేమ పథకాన్ని అందించారన్నారు. దేవుడు వర్షాలు కురిపిస్తుంటే.. జగనన్న సంక్షేమ పథకాలు ఇస్తున్నారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం తన పుట్టినిల్లుగా మారి ప్రతి కష్టాన్ని తీర్చిందన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపింది.ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలానికి చెందిన మహిళ అశ్విని మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చాలా కష్టాలు పడ్డామన్నారు. రుణమాఫి చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారన్నారు. సీఎం జగన్ చెప్పినవి, చెప్పవని కూడా ఎన్నో సంక్షేమ



పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ నిరూపించుకుంటున్నారన్నారు.ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు హయాంలో ప్రకాశం జిల్లా అభివృద్ధి శూన్యమన్నారు.ఇచ్చిన మాట నిలబెట్టుకుని సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలను మోసం చేసిందన్నారు. సీఎం జగన్‌కు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి అని మంత్రి సురేష్ అన్నారు.మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దేనని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.

## గ్యాస్ ధరలను అదుపులో పెట్టాల్సిన బాధ్యత కేంద్రానిదే: అశోక్ గజపతి

విజయనగరం: గ్యాస్ ధరలను అదుపులో పెట్టాల్సిన బాధ్యత కేంద్రానిదే అని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదిన వేడుకల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌కు అశోక్ గజపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల మంటతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు వైషమ్యాలు లేకుండా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో అసలు తెలుగు భాష లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచమంతా తల్లి భాషలోనే విద్య కొనసాగుతోందని...కానీ ఏపీలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు అమలు చేయలేదు కాబట్టే అప్పట్లో తాను కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశానని చెప్పుకొచ్చారు. ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ప్రధాని మోడీ..కొన్ని విషయాల్లో స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రజా సౌకర్యాలను తాకట్టు పెడుతోందని... ఇది ప్రపంచంలో ఎక్కడా లేదని వ్యాఖ్యానించారు.

## ప్రతిపక్షాలపై మండిపడ్డ హోంమంత్రి సుచరిత

గుంటూరు: గంజాయి వ్యవహారానికి సంబంధించి ప్రతిపక్షాలపై హోంమంత్రి సుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు బట్ట కాల్చి ముఖంపై వేస్తున్నాయని...తాలిబన్‌కు ఏపీకి సంబంధం అంటగడుతున్నారని అన్నారు. సీఎం ప్రతిష్టను దిగజార్చాలని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలను నివారించడానికి సెబ్ ఏర్పాటు చేశామన్నారు. గుజరాత్‌లో డ్రగ్స్ దొరకాయని మోదీకి సంబంధం ఉందంటారా అని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున డ్రగ్స్ దొరికాయని.... అందరూ కలిసి డ్రగ్స్ రవాణా జరగకుండా చేయాలన్నారు. దేశంలో డ్రగ్స్ రాకుండా కేంద్రం కూడా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్ద ఎత్తున డ్రగ్స్ రావడం అందరి వైఫల్యంగా భావించాలని హోంమంత్రి సుచరిత పేర్కొన్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 08 అక్టోబరు 2021

## ఆఫ్గన్, పాకిస్తాన్ మధ్య సైలెంట్ వార్

ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్‌లకు బలమైన పాలనను స్థాపించడంలో సహాయపడిన పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ జనరల్ ఫైజ్ హమీద్ ను ఆ పదవి నుండి తొలగించారు. మీడియా నివేదికల ప్రకారం, ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ అంటే ఐఎస్ఐ చీఫ్ ఫైజ్ గత నెలలో ఆర్మీ చీఫ్ జనరల్ ఖమర్ జావేద్ బజ్వా ఆమోదం తీసుకోకుండా కాబూల్ వెళ్లారు. అక్కడ, తాలిబాన్ నాయకులతో పాటు, సెరెనా హోటల్‌లో టీ-పార్టీకి హాజరయ్యారు. అక్కడ తాలిబాన్ పాలనను స్థాపించడానికి ఆయన సహాయం చేశారని ఆరోపణలు వచాయి. నిజానికి జనరల్ ఫైజ్ పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కు అప్పుడు. ఈయన వచ్చే ఏడాది ఆర్మీ చీఫ్ అవ్వాల్సి ఉంది. జనరల్ బజ్వాతో పాటు, అమెరికా కూడా ఆయన కాబూల్ సందర్శనతో చాలా కోపంగా ఉందని చెబుతారు. ఇప్పుడు ఫైజ్ హమీద్ స్థానంలో జనరల్ నదీమ్ అంజుమ్ ఐఎస్ఐ కొత్త చీఫ్‌గా ఉంటారు. జనరల్ హమీద్ తొలగింపు వార్తలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి, కానీ సైన్యం ఆధిపత్యం కారణంగా, పాకిస్తాన్ ప్రధాన మీడియా ఈ నివేదికలను అణిచివేస్తోంది. హమీద్‌ను పెషావర్ కార్ప్స్ కమాండర్ చీఫ్‌గా పంపారు. ఆర్మీ చీఫ్ కూడా ఉన్నత స్థాయిలో కొన్ని ఇతర మార్పులు చేశారు. జనరల్ హమీద్ అలాగే బజ్వా మధ్య తగాదా వార్తలు చాలా కాలంగా వెలుగులోకి వస్తున్నాయనేది కూడా నిజం. రావల్పిండిలోని ఆర్మీ హౌసింగ్ ప్రాజెక్ట్ విషయంలో మూడేళ్ల క్రితం ఇద్దరి మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయని చెబుతారు. తరువాత, ఇమ్రాన్ బజ్వాకు మూడేళ్ల పొడిగింపు ఇచ్చినప్పుడు, ఈ టగ్ ఆఫ్ వార్ బహిర్గతం అయింది. బజ్వాను విశ్వాసంలోకి తీసుకోకుండా ఫైజ్ చాలాసార్లు నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించాడు. ప్రధాన మంత్రికి ఐఎస్ఐ చీఫ్ నియమించే అధికారం ఉంది. అందుకే ఇమ్రాన్ ఫైజ్‌ని చీఫ్ గా చేసాడు ఆయనే అతనిని తలగించారు. ప్రత్యేక విషయం ఏమిటంటే, ఆర్మీ చీఫ్ సలహా మేరకు ప్రధాని ఈ నిర్ణయం తీసుకుంటారు. అందువల్ల, బజ్వా సలహా మేరకు జనరల్ హమీద్ ను తొలగించి ఉండవచ్చని చెప్పవచ్చు. అయితే, ఇమ్రాన్ ఫైజ్‌ను తొలగించడానికి అనుకూలంగా లేరు అని అక్కడి మీడియా చెబుతోంది. పాకిస్తాన్‌లోని కొంతమంది జర్నలిస్టులు ఈ విషయంలో అమెరికా కోణం ఉందని నమ్ముతారు. నిజానికి, ఫైజ్ కాబూల్ సందర్శన, తాలిబాన్ నాయకులతో భేటీ కావడం బిడెన్ పరిపాలనకు విసుగు తెప్పించింది. వైట్ హౌస్ జనరల్ ఫైజ్ ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా ఓటమిని తాలిబాన్ నాయకులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్నట్లు అనిపించింది. ఆగస్టు 15 న, తాలిబాన్లు కాబూల్‌తో సహా దాదాపు ఆఫ్ఘనిస్తాన్ను స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ సైన్యం ఐఎస్ఐ తాలిబాన్లకు అన్ని విధాలుగా సహాయపడుతున్నాయని ప్రపంచం ఇప్పటికే అనుమానించింది. సెప్టెంబర్ ప్రారంభంలో, జనరల్ ఫైజ్ హమీద్ నిశ్శబ్దంగా కాబూల్ వచ్చారు. ఇక్కడ ఒకే ఒక ఫైవ్ స్టార్ హోటల్ ఉంది. దాని పేరు సెరెనా హోటల్. ఇక్కడ అతను తన చేతిలో టీ కప్పుతో అగ్రశ్రేణి తాలిబాన్ నాయకులతో చాట్ చేస్తూ కనిపించారు. యాదృచ్ఛికంగా, బ్రిటన్ నుండి ఒక మహిళా జర్నలిస్ట్ ఈ హోటల్‌లో ఉన్నారు. ఆమె ఫైజ్ ఫోటోలను తీయడమే కాకుండా కొన్ని ప్రశ్నలు కూడా అడిగింది. ప్రతిస్పందనగా, ఫైజ్ అంతా బాగుంది అని చెప్పాడు. ఇక్కడ నుండి ఈ వార్త అగ్నిలా వ్యాపించింది. హమీద్‌తో బాజ్వా,అమెరికా కలత చెందాయి. అతడిని తొలగించాలని ఇమ్రాన్ పై ఒత్తిడి పెరుగుతూ వచ్చింది.

# టీడీపీ ఓట్లు ఎవరికి..

కడప, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)బద్వేల్ ఉప ఎన్నిక అనివార్యమయింది. ప్రధాన పార్టీలు బరి నుంచి తప్పుకున్నా ఎన్నిక జరగాల్సి ఉంది. బలం లేని పార్టీలతో బలప్రదర్శన చేస్తుంది. సమఉజ్జీలు లేకపోవడంతో బద్వేలు ఉప ఎన్నికల్లో వైసీపీ విజయం సునాయాసమయింది. బద్వేలు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ లు పోటీ పడుతున్నాయి. వైసీపీ అభ్యర్థిగా దాసరి సుధ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తన అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కమలమ్మను ప్రకటించింది. ఇక్కడ రెండు ప్రధాన జాతీయ పార్టీలకూ ఓటు బ్యాంకు లేదు. దీంతో వైసీపీకి ఏకపక్ష విజయమే. అయితే ఇప్పుడు తెలుగుదేశం, జనసేన ఓటు బ్యాంకు ఎటువైపు మరలతాయన్నది ఆసక్తికరంగా మారింది.తెలుగుదేశం పార్టీ, జనసేన బద్వేలు ఉప ఎన్నిక నుంచి తప్పుకున్నాయి. ఇక్కడ ఒక్క టీడీపీయే బలంగా ఉంది. బలమైన నేతలున్నారు. అయితే వైసీపీకి రికార్డు స్థాయి మెజారిటీ రాకుండా ఉండేందుకు ఈ పార్టీ ఓటు బ్యాంకు ఏ పార్టీవైపు తరలుతుందన్నది చర్చనీయాంశంగా మారింది. టీడీపీకి గత ఎన్నికల్లో దాదాపు యాభై వేలకు పైగానే ఓట్లు వచ్చాయి. వైసీపీ 44 వేల ఓట్ల మెజారిటీతో గత ఎన్నికల్లో గెలిచింది.అయితే బద్వేలులో టీడీపీ ఓటు బ్యాంకు ఇప్పుడు బీజేపీకి టర్న్ అవుతుందా? లేక కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకత్తం లోపాయికారీగా ఈ ఎన్నికల్లో ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది. కొందరు నేతలు కాంగ్రెస్ కు మద్దతిస్తేనే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. బీజేపీని దెబ్బతీయడానికి ఇది ఒక మంచి అవకాశంగా భావిస్తున్నారు. ప్రధానంగా టీడీపీపై ఒంటికాలు మీద లేస్తున్న సోము వీర్రాజు నాయకత్వాన్ని కూడా ఈ ఎన్నిక ద్వారా ప్రశ్నించవచ్చని వారు భావిస్తున్నారు.కాంగ్రెస్ ఇక రాష్ట్రంలో ఎదిగే అవకాశం లేదు. ఆ పార్టీకి బద్వేలులో మద్దతిచ్చినా వచ్చే సాధారణ ఎన్నికల సమయానికి తిరిగి తమ ఓటు బ్యాంకు తమకు ఉంటుందన్న క్యాలిక్యులేషన్ లో ఉన్నారు. తమ క్యాడర్ కు త్వరలోనే ఏ పార్టీకి ఓటు వేయాలన్న దానిపై పరోక్షంగా స్థానిక నాయకత్వం సంకేతాలు పంపుతుందంటున్నారు. మొత్తం మీద టీడీపీ ఓటు బ్యాంకు బద్వేలు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు వెళుతుందన్న టాక్ కడప జిల్లా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది..జనసేన ఓటర్లు దారెటు తెలుగుదేశం పార్టీ, జనసేన పొత్తుపై త్వరగా క్లారిటీ వస్తే బాగుంటుందన్న అభిప్రాయం అందరిలోనూ ఉంది. ముఖ్యంగా బీజేపీ ఇందుకోసం ఎదురు చూస్తుంది. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీతో కలసి పోటీ చేస్తుందన్న ప్రచారం రోజురోజుకూ పెరుగుతుంది. దీనికి అనుగుణంగా ఆ రెండు పార్టీల అడుగులు కన్పిస్తున్నాయి. దీంతో దీనిపై తేల్చేయడానికి బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు డిసైడ్ అయినట్లే కన్పిస్తుంది.పవన్ కల్యాణ్ ను వదులకోవడం బీజేపీకి ఎంత మాత్రం ఇష్టంలేదు. చరిష్మా ఉన్న నేత కావడం, ఒక సామాజికవర్గానికి బ్రాండ్ గా ఉండటంతో ఆయనతోనే వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్నది బీజేపీ కేంద్ర నాయకత్వం ఆలోచన. అందుకే బీజేపీ, జనసేన అధికారంలోకి వస్తే పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిని చేస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిచేతనే ప్రకటన చేయించారు. కానీ పవన్ కల్యాణ్ కు సీఎం పదవి కన్నా జగన్ ను ఓడించడమే లక్ష్యంగా కన్పిస్తుంది.అందుకే బలం లేని బీజేపీతో కలసి ప్రయాణించడం కంటే టీడీపీతో వెళ్లడమే ఉత్తమం అని అనుకంటున్నారు. అందుకే వరసగా టీడీపీకి దగ్గరయ్యే డైలాగులు ఆయన నుంచి వినపడుతున్నాయి. బద్వేల్ ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకోవడంలో ఆ రెండు పార్టీలు అనుకునే చేశాయన్న అనుమానాలు లేకపోలేదు. అందుకే సోము వీర్రాజు ఇప్పుడు పవన్ కల్యాణ్ కు పరీక్ష పెట్టనున్నారు. బద్వేల్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బరిలో ఉంటారు.బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయాలని పవన్ కల్యాణ్ ను సోము వీర్రాజు కోరనున్నారు. అంటే ఒకరకంగా పవన్ కు ఇది కష్టమే. తాను బరి నుంచి తప్పుకున్నా, బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా పవన్ కల్యాణ్ ప్రచారం చేసే అవకాశం 99 శాతం ఉండకపోవచ్చు. పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారానికి రాకుంటే ఆయన టీడీపీకి దగ్గరవుతున్నారనే బీజేపీ భావిస్తుంది. జనసేన తమ నుంచి వెళ్లిపోయినా ఇప్పటి నుంచే పార్టీని బలోపేతం చేసుకునే వీలుకలుగుతుందని సోము వీర్రాజు అంచనా వేస్తున్నట్లుంది. అందుకే ఇప్పుడు బద్వేల్ కు జనసేనాని వస్తారా? రారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# పీపీపీకి వైజాగ్ పోర్టు

విశాఖపట్టణం, అక్టోబరు 7, (న్యూస్ పల్స్(మన రాష్ట్రంలోని ప్రధాన ఓడ రేవు వైజాగ్ పోర్టు ట్రస్ట్ (విపిటి)ను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) ముసుగులో పోర్టులోని బెర్తులన్నిటినీ కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఏడు బెర్తులు ప్రైవేట్ ప్లేయర్ల ఆధ్వర్యాన నడుస్తున్నాయి. తాజాగా మరో నాలుగు బెర్తులను ప్రైవేట్ ప్లేయర్లకు అప్పగించనున్నారు. క్రమంగా అన్ని బెర్తులనూ ప్రైవేట్ వారికి అప్పగించి పోర్టును నిర్వీర్యం చేయాలని చూస్తోంది. విపిటిలో ఇప్పటికే అదానీకి కేటాయించిన ఈక్యూ-1 టర్మినల్ బెర్తును 2019 సంవత్సరం నుంచి వ్యాపారం చెయ్యకుండా ఆయన వదిలేసి పోర్టుకు ఆదాయం లేకుండా చేశాడు. పైగా, రూ.వందల కోట్లు తాను నష్టపోయానంటూ, పోర్టు యాజమాన్యమే ఈ మొత్తాన్ని చెల్లించాలంటూ పట్టుపట్టి కూర్చొన్నాడు. డబ్ల్యు క్యూ-6 బెర్తును కూడా ఎబిజి అనే ప్రైవేట్ ప్లేయర్ రెండేళ్లుగా వదిలేశాడు. ఇటువంటి అనుభవాలు పోర్టుకు ఉన్నా కొత్తగా నాలుగు బెర్తులను పిపిపి పేర కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ సహాయ మంత్రి శాంతన్ ఠాకూర్ రెండు రోజుల విశాఖ పోర్టు పర్యటనలో నాలుగు బెర్తులను పిపిపి కింద ఇచ్చే ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అదే సందర్భంలో దేశంలో మేజర్ పోర్టుల ప్రైవేటీకరణ బిల్లుపై స్పందిస్తూ, 'ప్రైవేటీకరణ నిర్ణయం ఇప్పట్లో లేదు' అని ప్రకటించారు. బిజెపి రెండు నాల్కల ధోరణికి ఇదొక తార్కాణం. తాత్కాలికంగా ఆదాయం వస్తుందనే కక్కుర్తితో తలూపి 'ల్యాండ్ లార్డ్ పోర్టు' హోదాతో పబ్బం గడపాలనే యాజమాన్యం తీరు పోర్టును సమీప భవిష్యత్తులో కష్టాల్లోకి నెట్టేసేలా ఉందంటూ ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆక్షేపిస్తున్నారు.విశాఖ పోర్టులో 26 టర్మినల్ బెర్తులు ఉన్నాయి. వీటి ద్వారా జరిగే కార్గో హేండ్లింగే (వ్యాపారమే) పోర్టుకు ప్రధాన ఆదాయవనరు. వీటిని వంద శాతం పోర్టే నిర్వహిస్తే ఆదాయమంతా పోర్టుదే. కానీ వీటిలో ఏడు బెర్తులను ఇప్పటికే ప్రైవేట్ ప్లేయర్లకు కట్టబెట్టేశారు. వీరిలో అదానీ, ఎస్సార్, వేదాంత, ఈక్యూ-10 (ఎవిఆర్ ఇన్ ఫ్రా), విఎస్‌పిఎల్- (గామన్ ఇండియా), విసిపిటిఎల్ -1 జెఎన్ బక్సీ గ్రూప్, విసిపిటిఎల్ -2 (జేఎన్ బక్సీ గ్రూప్) ఉన్నారు. ప్రస్తుతం విసిపిటిఎల్-2 విస్తరణ పనులు జరుగుతున్నాయి. విశాఖ ఓడరేవు సముద్రంలో 38 ఎకరాల్లో సముద్రాన్ని కప్పి కంటైనర్ టర్మినల్‌ను రూ.637 కోట్లతో విసిపిటిఎల్ యాజమాన్యం నిర్మిస్తోంది. ఈ కంటైనర్ టర్మినల్ బెర్త్ మరో 3 నెలల్లో పూర్తి కానుంది.కొత్తగా మరో నాలుగు బెర్తులను ప్రైవేట్ వారికి కట్టబెట్టనున్నారు. డబ్ల్యు క్యూ-7, 8-2 బెర్తుల (ఇన్నర్ హార్బర్‌లో)కు రూ.288 కోట్లతో త్వరలో టెండర్లు పిలిచేందుకు కేంద్రం అనుమతిని పోర్టు ఇప్పటికే కోరింది. ఈక్యూ-7 బెర్తు రూ.200 కోట్లతో అనుమతి కోసం పెట్టింది. డబ్ల్యు క్యూ-6 రూ.200 కోట్లతో ప్రతిపాదన ఉంది.

దీన్నే రెండేళ్ల క్రితం ఎబిజి ప్రైవేట్ ప్లేయర్ వదిలేసి వెళ్లిపోగా తాజాగా అనుమతి కోసం మరలా పెట్టారు. నాల్గో బెర్తు ఈక్యూ-6 రూ.200 కోట్లతోనే ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లింది. ప్రైవేట్ ప్లేయర్లు కార్గో వ్యాపారం చేసి సంపాదించే ప్రతి వంద రూపాయల్లో రూ.38 పోర్టుకు రెవెన్యూ షేర్ నెలనెలా వచ్చేలా బెర్తులను కొత్తగా టెండర్ల విధానం తీసుకొచ్చినట్లు పోర్టు అధికారులు చెబుతున్నారు. పోర్టు అవుటర్ హార్బర్‌లోగల వేదాంత ఈ పద్ధతిలోనే చెల్లిస్తోందని పోర్టు చెబుతోంది. డబ్ల్యు క్యూ-6 బెర్తు టర్మినల్‌ను ఎబిజి ప్లేయర్, అదానీ ఈక్యూ-1ను వదిలేసి వెళ్లిపోయి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకూ కొత్త ప్లేయర్లు రాలేదు. వీటిలో క్యూ-6కు తాజాగా టెండర్లు వేశారు. విశాఖ పోర్టు తన సొంత నిధులతో బెర్తులన్నిటినీ నిర్వహిస్తే వంద శాతం రెవెన్యూ పోర్టుకే ఉంటుంది. పిపిపి ప్రాజెక్టులతో నష్టపోతోంది. క్రమంగా పోర్టు మొత్తం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోయి ఈ బెర్తుల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండాపోతుంది. పిపిపితో లాభాలు వస్తాయన్న బిజెపి, పోర్టు యాజమాన్యం వాదన శుద్ధ అబద్ధం. ఇందుకు అదానీ టర్మినల్ వ్యవహారమే తార్కాణం. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక గతంలోనే పార్లమెంట్‌కు సమర్పిస్తూ పిపిపి వల్ల పోర్టులకు ఏ మాత్రమూ లాభం జరగలేదని, కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోవడం తప్ప ప్రయోజనం లేదని నివేదించింది.

# ఆక్సిజన్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ**

గోదావరిఖని అక్టోబర్ 7 కోవిడ్ మూడవ విడత వచ్చినా ఆక్సిజన్ సమస్య రాకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నూతన ఆక్సిజన్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం ఆక్సిజన్ అందక పోవడంతో కొంతమంది ప్రాణాలను కోల్పోవడం జరిగిందని గుర్తు తెచ్చుకున్నారు. అందుకే కోవిడ్ సెకండ్ వెవ్ పూర్తి కాకముందే ప్రాణవయువు కొరతతో ఏ ఒక్క రోగి ప్రాణాలను కోల్పోకుండా ఉండాలనే ఉద్యేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కేర్ (ప్రధాన మంత్రి నిధి) సహకారంతో రాష్ట్రం లోని ప్రతి జిల్లాకు ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ను కేటాయించారన్నారు. ఈ రోజు దేశ ప్రధాన మంత్రి 34 ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్ లను ప్రారంభించి దేశానికి అంకితం చేశారని తెలిపారు. అందులో భాగంగానే మన జిల్లాలోని గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి 500 లీటర్ ఫర్ మినిట్ ఆక్సిజన్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు. దీని ద్వారా జ సరిపడా ఆక్సిజన్ ఉత్పతి చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వాసుదేవ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో ముఖ్య నిర్ణయాలు

తిరుమల, అక్టోబర్ 07టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వై.వి.సుబ్బారెడ్డి అధ్యక్షతన గురువారం తిరుమల అన్నమయ్య భవనంలో నూతన బోర్డు తొలి సమావేశం జరిగింది. ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల వివరాలు ఇలా ఉన్నాయి..

- జమ్మూలో శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.17.40 కోట్లతో టెండర్లకు ఆమోదం
- చెన్నై, బెంగళూరు, ముంబైలో టిటిడి సమాచార కేంద్రాలు మరియు శ్రీవారి ఆలయాల స్థానిక సలహా మండళ్లకు ఛైర్మన్ల నియామకానికి ఆమోదం

.చెన్నై - ఎ.జె.శేఖర్ రెడ్డి,బెంగళూరు- రమేష్ శెట్టి, ముంబై - అమోల్ కాలే


- అలిపిరి కాలిబాట సుందరీకరణ పనులకు రూ.7.50 కోట్లతో టెండర్లకు ఆమోదం
- వైఎస్ఆర్ జిల్లా రాయచోటిలో టిటిడి కల్యాణమండపం నిర్మాణానికి రూ.2.21 కోట్లతో టెండర్లకు ఆమోదం
- టిటిడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ఆప్‌కాస్ తరహాలో టిటిడి కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం
- టిటిడి ఉద్యోగుల హెల్త్ ఫండ్‌కు ఆమోదం.- తిరుమలలోని వరాహస్వామి విశ్రాంతి భవనం'2లో పలు ప్రత్యేక అభివృద్ధి పనులు మరియు మరమ్మతులు చేపట్టేందుకు రూ.2.61 కోట్లతో టెండర్లకు ఆమోదం.
- స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ భవనంలో అదనంగా 4, 5 అంతస్తుల నిర్మాణానికి రూ.4.46 కోట్లతో టెండర్లకు ఆమోదం

ఈ సమావేశంలో టిటిడి ఈవో డాక్టర్ జవహర్‌రెడ్డి, బోర్డు సభ్యులు అశోక్ కుమార్, ప్రశాంతి రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, జీవన్ రెడ్డి, డా.చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మల్లీశ్వరి, మారుతి ప్రసాద్, రామేశ్వర రావు, నందకుమార్, క్రిష్ణారావు, విద్యాసాగర్‌రావు, లక్ష్మీనారాయణ, మొరంశెట్టి రాములు, డా.శంకర్, విశ్వనాథ్, మిలింద్ నర్వేకర్, బోర సౌరబ్, డా.కెతన్ దేశాయ్, సనత్‌కుమార్, సంజీవయ్య, వర్చువల్‌గా శ్రీనివాసన్, రాజేష్ శర్మ పాల్గొన్నారు. అదేవిధంగా అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మయ్య, సివిఎస్వో గోపినాథ్ జెట్టి పాల్గొన్నారు.

# టార్గెట్ పీకే

విజయవాడ, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో అన్ని పార్టీలకూ వ్యూహాలు అవసరం. కానీ తమ వ్యూహాలను దెబ్బతీసే వారినే మొదట లక్ష్యంగా ఎంచుకుంటారు. ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి జగన్ కంటే ప్రశాంత్ కిషోర్ టీంను ఇప్పుడు విపక్ష నేతలు టార్గెట్ చేస్తున్నారు. వారి అనుకూల మీడియా సయితం రోజుకోసారి ప్రశాంత్ కిషోర్ పై విమర్శలు గుప్పిస్తూ కథనాలను వండి వారుస్తుంది. జగన్ మంత్రి వర్గ సమావేశంలో పీకే టీం వస్తుందని చెప్పిన నాటి నుంచి మరింత జోరు పెంచారు.ప్రశాంత్ కిషోర్ వ్యూహాలతోనే తాము 2019 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయామని టీడీపీ గట్టిగా నమ్ముతుంది. జగన్ పై ప్రజలకు విశ్వాసం లేదని, పీకే టీం సోషల్ మీడియా ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబుపై చేసిన దుష్ప్రచారం కారణంగానే తమ పార్టీ ఓడిపోయిందని, లేకుంటే ఇంతటి దారుణమైన ఫలితాలు వచ్చి ఉండేవి కావన్నది టీడీపీ నేతల విశ్లేషణ. అందుకే ప్రశాంత్ కిషోర్ అంటేనే టీడీపీకి ఒళ్లు మంట. ఆయన పేరెత్తితేనే రగిలిపోతుంటారు.బీహార్ నుంచి వచ్చి ఏపీ రాజకీయాల్లో తమను దెబ్బకొట్టాడని ఇప్పటికీ రగిలిపోతుంటారు. వచ్చే ఎన్నికల్లో కూడా ప్రశాంత్ కిషోర్ తన టీంను పంపిస్తున్నారని తెలిసి ఇప్పటి నుంచే ఆయనను టీడీపీ, దాని అనుకూల మీడియా టార్గెట్ గా పెట్టుకున్నట్లు కన్పిస్తుంది. సినీనటు పోసాని కృష్ణమురళి పవన్ కల్యాణ్ పై చేసిన అభ్యంతర వ్యాఖ్యల వెనక కూడా ప్రశాంత్ కిషోర్ ఉన్నారంటూ జోరుగా ప్రచారం చేస్తుంది.ఇక రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అయితే ప్రశాంత్ కిషోర్ ప్రోద్భలంతోనే పోసాని ఆ కామెంట్స్ చేశారని వ్యాఖ్యానించడం విశేషం. బీహారీ సంస్కృతిని ఏపీలో ప్రవేశపెడుతున్నా రన్నారు. ఇక టీడీపీ అనుకూల మీడియా అయితే అసలు ఏపీలో కులాల వారీగా విభజన చేసింది, కుల ఘర్షణలను తలెత్తేలా చేసిందంటూ ప్రశాంత్ కిషోర్ పై స్పెషల్ ఫోకస్ లను నడుపుతున్నాయి. మొత్తం మీద ప్రశాంత్ కిషోర్ టీం మరోసారి ఏపీలోకి అడుగు పెట్టకముందే టీడీపీకి కొంత దడ పుట్టిందనే

# హైదరాబాద్‌లో రూ.100 దాటిన లీటర్ డీజిల్ ధర



హైదరాబాద్/ ఢిల్లీ అక్టోబర్ 7 దేశంలో పెట్రో మంట కొనసాగుతున్నది. వరుసగా మూడో రోజు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. గురువారం నాడు హైదరాబాద్‌లో పెట్రోల్‌పై 32 పైసలు, డీజిల్‌పై 38 పైసలు వడ్డించాయి. దీంతో లీటర్ డీజిల్ ధర రూ.100 దాటింది. ప్రస్తుతం డీజిల్ ధర రూ.100.13కు చేరగా, పెట్రోల్ రూ.107.41కు పెరిగింది. నిన్న గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరను రూ.15 పెంచిన విషయం తెలిసిందే. బుధవారం లీటర్ పెట్రోల్‌పై 30 పైసలు, డీజిల్‌పై 35 పైసల చొప్పున పెంచిన దేశీయ చమురు మార్కెటింగ్ సంస్థలు మరోమారు సామాన్యుడిపై భారం మోపాయి. తాజాగా పెట్రోల్‌పై 30 పైసలు, డీజిల్‌పై 35 పైసలు వడ్డించాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.103.24కు, డీజిల్ ధర రూ.91.77కు చేరింది.ఇక ముంబైలో పెట్రోల్ 29 పైసలు పెరిగి రూ.109.25కు పెరగగా, డీజిల్ 38 పైసలు అధికమై రూ.99.55కు చేరింది. కోల్‌కతాలో పెట్రోల్ రూ.103.94 (29 పైసలు), డీజిల్ రూ.94.88 (35 పైసలు), చెన్నైలో పెట్రోల్ రూ.100.75 (26 పైసలు), డీజిల్ రూ.95.26 (33 పైసలు)కు చేరాయి.-

# కుప్పం కూలిపోక ముందే

తిరుపతి, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును వరస ఎన్నికలు కుదురుగా నిలవనిచ్చేట్లు లేవు. ఆయన పార్టీని బలోపేతం చేయాలని చేస్తున్న ప్రయత్నాలకు ఎన్నికలు అడ్డుపడుతున్నాయి. బద్వేలు ఉప ఎన్నిక నుంచి తప్పుకుని ఇక జిల్లాలను పర్యటించాలనుకుంటున్న సమయంలో కుప్పం నియోజకవర్గంలో మరో ఎన్నిక వచ్చి పడే అవకాశం కన్పిస్తుంది. త్వరలో కుప్పం మునిసిపాలిటీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయంటున్నారు.కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే చంద్రబాబు పట్టు కోల్పోయారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు కుప్పంలో రివర్స్ సీన్ కనిపిస్తుంది. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కుప్పం నియోజకవర్గంలో వైసీపీ గెలుచుకుంది. పంచాయతీ ఎన్నికల్లోనూ చంద్రబాబుకు ఎదురుదెబ్బ తగిలింది. పంచాయతీ ఎన్నికలు అయిపోయిన వెంటనే చంద్రబాబు కుప్పం వెళ్లి పార్టీని గాడిన పెట్టే ప్రయత్నం చేశారు.కానీ పరిషత్ ఎన్నికల్లోనూ పార్టీకి కోలుకోలేని దెబ్బతగలడం, కుప్పం మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగే అవకాశముండటంతో చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో త్వరలోనే పర్యటిస్తారంటు న్నారు. దసరా తర్వాత కాని, ముందు కాని చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటించే అవకాశముంది. ఈసారి ఇక్కడ నాలుగు రోజుల పాటు చంద్రబాబు పర్యటించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ప్రధానంగా కుప్పంలోని టీడీపీ నేతలపై అసమ్మతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీరిని కట్టడి చేసేలా చంద్రబాబు పర్యటన కొనసాగనుంది. అదే సమయంలో తనకు కుప్పం ప్రజల అండ ఎంత అవసరమో చంద్రబాబు ప్రజలకు వివరించనున్నారు. మండలాల వారీగా నేతలతో సమావేశాలు జరపనున్నారు. దీంతో పాటు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పార్టీ అభ్యర్థుల ఎంపికపై కూడా చంద్రబాబు ఈ సందర్భంగా దృష్టి పెట్టనున్నారు.

# 3 సార్లు కాపులు దెబ్బతీశారు

ఏలూరు, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎన్నికలకు ముందు మారే అవకాశాలున్నాయి. అయితే ఈసారి ఎన్నికల్లో కాపు సామాజికవర్గం ఎన్నికల్లో కీలకంగా మారనుంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కాపు సామాజికవర్గం ఏ స్టాండ్ తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. కాపు రిజర్వేషన్ల అంశం రానున్న ఎన్నికల్లో కీలకంగా మారనుంది. అయితే ఇది టీడీపీకి అడ్వాంటేజీగా మారనుందా? లేక వైసీపీ అనుకూలమా? అన్న చర్చ జరుగుతోంది.తెలుగుదేశం పార్టీ కాపుల దెబ్బ ఇప్పటికే రుచి చూసింది. ఇప్పటికి మూడుసార్లు టీడీపీ కాపుల వ్యతిరేకమవ్వడంతో ఓటమి పాలయింది. 1989 లో వంగవీటి రంగా హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘోర పరాజయానికి కారణం కాపుల నుంచి వెల్లువలా వచ్చిన వ్యతిరేకతే కారణం. రంగా హత్య ఏపీ రాజకీయాల్లో కులాల ప్రభావాన్ని మరింత పెంచిందనే చెప్పాలి. ఆ తర్వాత కూడా తెలుగుదేశం పార్టీకి కాపులు శాపంగా మారారు. 2009లో చంద్రబాబు విజయం సాధించాలనుకున్నారు.

## ఆనందయ్య వెనుక ఎవరు

నెల్లూరు, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)కరోనా సమయంలో గుళికలు వేసిన ఆనందయ్య కూడా ఏపీలో రాజకీయ పార్టీ పెడతారట. బీసీల్లోని అన్ని కులాలను కలుపుకుని ప్రత్యేకంగా ఒక పార్టీ పెడతారట. అయితే ఇది ఆనందయ్యకు పుట్టిన బుద్ధికాదంటున్నారు. దీనిని వెనకుండి ఎవరో నడిపిస్తున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గం లక్ష్యంగా చేసుకుని ఆనందయ్యను ఈ రాజకీయ రొంపిలోకి కొందరు బలవంతంగా దించుతున్నారన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.రాజకీయ పార్టీ పెట్టడం తప్పు కాదు. ఎవరైనా పెట్టుకోవచ్చు. కానీ కేవలం ఒక నియోజకవర్గం కోసమే పార్టీ పెట్టడం ఎన్నడైనా చూశామా? అంటే ఆనందయ్యనే చూపుతున్నారు. ఆనందయ్య ఎవరో 2020 వరకూ ఎవరికీ పెద్దగా తెలియదు. ఆయన సాధారణ ఆయుర్వేద వైద్యుడు. ఆయుర్వేద మందు తయారీ చేసి ఆయన ఉచితంగా ప్రజలకు పంపిణీ చేసేవారట. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంకు చెందిన ఆనందయ్య పూర్వీకుల నుంచి ఆయుర్వేద మందు తయారీ సంప్రదాయంగా వస్తుంది.ఇక కరోనా సెకండ్ వేవ్ సమయంలో ఆనందయ్య పేరు రాష్ట్రమంతటా మారుమోగింది. ఆనందయ్య ఇచ్చే మందుతో కరోనా తగ్గిపోయిందన్న ప్రచారం జరిగింది. పల్స్ రేట్ కూడ పెరిగిందన్న వార్తలు రావడంతో ఆ గ్రామానికి వేల సంఖ్యలో జనం క్యూ కట్టారు. ఆనందయ్య మందును చివరకు ప్రభుత్వం కూడా గుర్తించింది. మందు తయారీకి అనుమతి ఇచ్చింది. అయితే సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిలు కూడా ఆనందయ్యకు అండగా నిలిచారు.ఆనందయ్యకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలంటూ కొందరు డిమాండ్ చేశారు. ఈ హడావిడి రెండునెలలు ఉంది. ఆ తర్వాత ఆనందయ్యను మర్చిపోయారు. అయితే యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆనందయ్య చేత కొత్త పార్టీ పెట్టిస్తే ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో సమీకరణాలు మారే అవకాశాలున్నాయి. అందుకే కొందరు కావాలని ఆయన చేత రాజకీయ పార్టీ ప్రకటన చేయించారంటున్నారు.

## కూరగాయల రైతుల కుదేల్

విజయనగరం, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)ఆరుగాలం పండించిన కాయగూరల పంటలు గులాబ్ దెబ్బకు నేలమట్టమయ్యాయి. ఆదాయం రాకపోగా, పెట్టిన పెట్టుబడులు నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో తుపాను దాటికి వరి, చెరకు, అరటి, మొక్కజొన్న వంటి పంటలతో పాటు కాయగూరల పంటలూ అదే స్థాయిలో దెబ్బతిన్నాయి. దీంతో వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూశారు. కానీ వీటి నష్టాన్ని గుర్తించడంలో ఉద్యానశాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గులాబ్ తుపానుతో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు పంటలు బాగా దెబ్బతిన్నాయి. సుమారు వారం రోజులు పాటు ముంపు ఉండడంతో పంటలన్నీ మరింత దెబ్బతిన్నాయి. ముఖ్యంగా వంగ, చిక్కుడు, బీర, ఇతర ఆకుకూరల పంటలన్నీ కుళ్లిపోయాయి. దీంతో ప్రతి రైతు ఎకరా పంట వద్ద రూ.30వేలు నుంచి రూ.50వేలు వరకు నష్టపోయారు. జిల్లాలోని 2 వేల ఎకరాల్లో కాయగూరల పంటలు దెబ్బతినగా, జామి మండలంలో 200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ఒక్క జామి మండల కేంద్రమే కాదు, మండలంలోని రామయ్యపాలెం, లక్ష్మీపురం, జాగారం, పావాడ గ్రామాలతో పాటు ఎస్.కోట తదితర మండలాల్లో కాయగూరల పంట నష్టం భారీగానే జరిగింది.రెండు ఎకరాల్లో కాయగూరలు పండిస్తున్నాను. 30సెంట్లలో వంగ తోట పూర్తిగా దెబ్బతింది. చిక్కుడు, ఇతర పంటలు కూడా దెబ్బతిన్నాయి. దీంతో సుమారుగా రూ.50వేలు వరకు నష్టపోయాను.వరి పంటతో పాటు చెరకు మొక్కతోట పూర్తిగా నెలకొరిగింది. దీంతో 50శాతం పంట నష్టపోయినట్లే, అలాగే రెండు ఎకరాల్లో కాయగురలు పంట పోయి రూ.50వేలు పైన నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.గులాబ్ తుపానుకు పెద్దఎత్తున పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. కాయగూరల పంటలు దెబ్బతినడంతో రైతులు రోజువారీ ఆదాయం కోల్పోయారు. తక్షణమే కాయగూరల పంటల నష్టాలను అధికారులు గుర్తించి, ప్రభుత్వానికి నివేదించాలి. ప్రభుత్వం కూడా, వెంటనే నష్టపరిహారాలు ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఏనుగు దాడిలో రైతుకు గాయాలు

చిత్తూరు అక్టోబరు 7, (న్యూస్ పల్స్) చిత్తూరు జిల్లా పలమనేరు మండలం పెంగరగుంట గ్రామం లో ఒంటరి ఏనుగు దాడిలో రైతుకు తీవ్ర గాయలయ్యాయి. గురువారం ఉదయం నాలుగున్నర గంటలకు రైతు వెంకటరెడ్డి తన పొలం వద్దకు వెళ్తుండగా వెనుక వైపు నుండి వచ్చిన ఏనుగు తొండంతో చుట్టి పొదల్లోకి విసిరేసింది. రైతుకు తీవ్రగాయాలు కాగా పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు, అటవీ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. అధికారులు ట్రాకర్ల సహాయంతో ఏనుగును అడవిలోకి తరలించారు.

## సింగనమల ఎమ్మెల్యేకు తప్పిన ప్రమాదం

అనంతపురం అక్టోబరు 7, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లా సింగనమల ఎమ్మెల్యే జొన్నల గడ్డ పద్మావతికి పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం ఇస్కాన్ టెంపుల్కి వెళ్లి వస్తుండగా జొన్నలగడ్డ పద్మావతి ప్రయాణిస్తున్న కారును మరో కారు ఢీకొట్టింది. ప్రమాదం నుంచి ఎమ్మెల్యే పద్మావతి సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా ప్రమాదం ధాటికి ఎమ్మెల్యే కారు పూర్తిగా ధ్వంసమైంది.

## పాకిస్తాన్లో భారీ భూకంపం.. 20 మంది మృతి..

### వందలాది మందికి గాయాలు..

న్యూఢిల్లీ అక్టోబరు 7, (న్యూస్ పల్స్)భారీ భూకంపంతో పాకిస్తాన్ చిగురుటాకులా వణికిపోయింది. గురువారం ఉదయం పాకిస్తాన్లోని బలూచిస్థాన్ ప్రావిన్స్ లో సంభవించిన భారీ భూకంపంతో 20మంది మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. బలూచిస్థాన్ ప్రావిన్స్లోని హర్నోయ్ జిల్లా లో గురువారం తెల్లవారుజామున 3.30 సమయంలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదయిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. క్వెట్టా, సిబ్బి, పిశిన్, ముస్లీం బాగ్, జియరత్, ఖిలా అబ్దుల్లా, సంజవి, జోబ్, చమన్ ప్రాంతాల్లో భుప్రకంపనాలు నమోదయ్యాయి. కాగా.. ఈ భూకంపం ధాటికి 20 మంది చనిపోయారని, 300 మందికి పైగా గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. మృతుల్లో మహిళలు, ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని బలూచిస్థాన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ అధికారులు వెల్లడించారు. రక్తం నిల్వలు, అంబులెన్సులు, హెలికాప్టర్లను అందుబాటులో వుంచామని బలూచిస్థాన్ ముఖ్యమంత్రి జామ్ కమాల్ ఖాన్ అల్యాని చెప్పారు. కాగా.. ప్రజలంతా నిద్రలో ఉండగా భారీ భూకంపం సంభవించింది. భవనాల పైకప్పులు కూలిపడటంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

## పుంజుకున్న రియల్ రంగం



ముంబై, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)కరోనాతో దెబ్బతిన్న రియల్టీ సెక్టార్ బలంగా పుంజుకుంటోంది. ముఖ్యంగా రెసిడెన్షియల్ మార్కెట్లో అమ్మకాలు కరోనా ముందుస్థాయికి చేరుకున్నాయి. ఆఫీసు స్పేసుకు కూడా డిమాండ్ పెరుగుతోంది. ప్రాపర్టీ రీసెర్చ్ కంపెనీ నైట్ ఫ్రాంక్ తాజా స్టడీ ద్వారా ఈ విషయం వెల్లడించింది. ఈ రిపోర్టు ప్రకారం.. 2021 మూడో క్వార్టర్లో 64,010 యూనిట్లను రియల్టర్లు డెలివరీ చేశారు. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే రెసిడెన్షియల్ అమ్మకాలు 92 శాతం గ్రోత్ని సాధించాయి. ముఖ్యంగా హైదరాబాద్, కోల్కతాలలో అమ్మకాలతోపాటు కొత్త ప్రాజెక్టులు కూడా కొవిడ్ ముందు స్థాయికి చేరాయి. థర్డ్ వేవ్ ముప్పు ఉన్నప్పటికీ, ఆఫీస్ ట్రాన్సాక్షన్స్ 2021 మూడవ క్వార్టర్లో సీక్వెన్షియల్గా బలమైన గ్రోత్ని సాధించాయి. మెట్రో సిటీల్లో మొత్తం మూడవ క్వార్టర్లో 12.5 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ అమ్ముడయింది. ఏడాది లెక్కన 168 శాతం గ్రోత్ కనిపించింది.పశ్చిమ బెంగాల్లో స్టాంప్ డ్యూటీ తగ్గింపు వల్ల కోల్కతాలో అమ్మకాలు గత సంవత్సరం క్యూ3 కంటే తాజా క్యూ3లో 75 శాతం పెరిగి 6,861 యూనిట్లకు చేరాయి. ఐటీ రంగంలో ఆరోగ్యకరమైన గ్రోత్ వల్ల బెంగళూరు కూడా బలంగా పుంజుకుంది. స్టాంప్ డ్యూటీ మినహాయింపును రద్దు చేసినప్పటికీ 2021 రెండవ క్వార్టర్లో ముంబై, పూణే మార్కెట్లు అమ్మకాల జోరును కొనసాగించాయి. స్పాట్ డిస్కౌంట్లు, ఫైనాన్సింగ్ డీల్స్ కూడా అమ్మకాలను పెంచాయి. కొత్త రెసిడెన్షియల్ ప్రాజెక్టుల లాంచ్లు ఏడాది ప్రాతిపదికన క్యూ3 లో 90 శాతం పెరిగి 58,967 యూనిట్లకు ఎగిశాయి. మునుపటి క్వార్టర్లో 27,453 రెసిడెన్షియల్ యూనిట్లు లాంచ్ కాగా, 27,232 రెసిడెన్షియల్ యూనిట్ల అమ్ముడయ్యాయి. మార్కెట్లలో వెయిటెడ్ యావరేజ్ ప్రైసెస్ 2021 మూడవ క్వార్టర్లో నిలకడగా ఉన్నాయి మునుపటి క్వార్టర్తో పోలిస్తే తగ్గలేదు. ఈ క్వార్టర్లో చెన్నై, హైదరాబాద్, కోల్కతా మార్కెట్లలో ఏడాది ప్రాతిపదికన ధరలు కొద్దిగా పెరిగాయి. రూ. 5–0 లక్షల నుంచి రూ.కోటి టికెట్ సైజులో అమ్మకాల వాటా ఒక సంవత్సరం క్రితం 32 శాతం ఉండగా, 2021 మూడో క్వార్టర్లో 35 శాతానికి చేరింది. అయితే రూ. 50 లక్షల టికెట్ సైజు కేటగిరీలో రెసిడెన్షియల్ అమ్మకాల వాటా క్యూ 3లో 45 శాతం నుండి 43 శాతానికి తగ్గిపోయింది. క్యూ3లో ఎనిమిది సిటీల్లోనూ కార్యాలయ లావాదేవీలు మెరుగుపడ్డాయి 2019 క్వార్టర్ అమ్మకాల్లో 83 శాతం వరకు మెట్రోల్లోనే జరిగాయి.చెన్నై, బెంగళూరు, ఢిల్లీ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఐటీ సెక్టార్ కంపెనీలు ఆఫీసు స్పేస్ను ఎక్కువగా కొన్నాయి. కరోనా ఎఫెక్ట్ను సమర్థంగా ఎదుర్కొన్న రియల్టీ మార్కెట్లలో హైదరాబాద్ ముందంజలో ఉందని మరో ప్రాపర్టీ కన్సల్టింగ్? ఫర్మ్? జేఎల్ఎల్ రిపోర్టు ప్రకటించింది. దీని ప్రకారం, ఏడు మెట్రో నగరాల్లో గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే జనవరి?–సెప్టెంబర్ 2021 లో ఇండ్ల అమ్మకాలు 47 శాతం పెరిగాయి. సెకండ్వేవ్ వల్ల 2021 మొదటి మూడు క్వార్టర్లో అమ్మకాలపై తీవ్ర ఎఫెక్ట్ కనిపించింది. 2021 క్యూ3లో అమ్మకాలు 65 శాతం మెరుగుపడ్డాయి. 32,300 రెసిడెన్షియల్ యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇవి గత క్యూ1తో పోలిస్తే 18 శాతం ఎక్కువ. ప్రాజెక్టుల లాంచ్లలో హైదరాబాద్ ఏకంగా 28 శాతం వాటాను సాధించింది. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ వంటి పెద్ద మార్కెట్లలో కొత్త లాంచ్లు ఎక్కువగా అఫోర్డబుల్, మిడ్ సెగ్మెంట్లలో ఉన్నాయి. "రాబోయే పండుగ సీజన్ కోసం రియల్టర్లు భారీగా కొత్త ప్రాజెక్ట్ లాంచ్లకు రెడీ అవుతున్నారు. కొనుగోళ్లు కూడా బాగానే ఉండొచ్చు. క్యూ3లో సేల్స్ చాలా బాగున్నాయి. హైదరాబాద్, కోల్కతా మార్కెట్లు కరోనా ఎఫెక్ట్ నుంచి వేగంగా కోలుకున్నాయి. డిస్కౌంట్లు, తక్కువ వడ్డీరేట్లు, పొదుపు బాగా పెరగడం వల్ల అమ్మకాలు బాగున్నాయి"

## శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

విజయవాడ అక్టోబరు 07 శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీ దగ్గర ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విజయవాడ ఈడుపుగల్లు శ్రీ చైతన్య హాస్టల్ రూమ్ లో ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీ చదువుతున్న ఎం.స్నేహిత్ వర్మ సూసైడ్ చేసుకొని చనిపోయిన విద్యార్థి మృతి పై సమగ్రమైన విచారణ జరిపించాలి. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షలు రూపాయలు ఇచ్చి ఆదుకోవాలి – ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కే.ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీ దగ్గర ఎస్ఎఫ్ఐ ధర్నా నిర్వహించారు. అనంతరం కృష్ణాజిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి రవికుమార్ గారికి, కంకిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ కాశీ. విశ్వనాద్ కి వినతిపత్రం అందజేశామని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కే ప్రసన్న కుమార్ మాట్లాడుతూ చైతన్య – నారాయణ విద్యాసంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలు ఎందుకు అరికట్టడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. అధిక ఫీజుల రూపంలో విద్యార్థులను తల్లిదండ్రులను ఒత్తిడి చేయడం విద్యార్థులు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న కార్పొరేటు విద్యాసంస్థలు గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ పరిధిలోని రెండు వందల మంది పైగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని వీటిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయిని అన్నారు.కృష్ణాజిల్లా కార్యదర్శి ఎం సోమేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్డూ అదుపు లేకుండా ఫీజుల రూపంలో విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. వీటిపై వెంటనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మరియు చనిపోయిన విద్యార్థి కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, ఇంటిస్థలం కుటుంబ సభ్యులకు కేటాయించాలని, ప్రభుత్వాన్ని కోరారు. దీనితోపాటు ఆవిద్యార్థిని మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పశ్చిమ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కోటి,జిల్లా కార్యదర్శి ఎం.సోమేశ్వరరావు,జిల్లా ఉపాధ్యక్షుడు సి. హెచ్. వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు ఏసుబాబు, నగర నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

## క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్పర్సన్

నెల్లూరు అక్టోబరు 07 నెల్లూరు జిల్లా ,గూడూరులో క్లీన్ ఆంధ్ర ప్రదేశ్(క్లాప్) కార్యక్రమానికి రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ శ్రీకారం చుట్టారు.జగనన్న స్వచ్ఛ సంకల్పం,ప్రత్యేక పారిశుధ్య అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత పట్టణంగా గూడూర్ ని తీర్చిదిద్దుతాం అని పేర్కొన్నారు. గూడూరు డంపింగ్ యా యార్డ్ ని అభివృద్ధి పరుస్తామన్న స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ చైర్పర్సన్ దేవసేనమ్మ గూడూరు మున్సిపల్ కార్యాలయంలో క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్పర్సన్ పొనకా దేవసేనమ్మ ప్రత్యేక సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గూడూరు శాసనసభ్యులు వి.వరప్రసాద్, గూడూరు ఆర్డీవో వి.మురళి కృష్ణ, రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మేరిగ మురళి, గూడూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్,గూడూరు మున్సిపల్ శాఖ శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పొనకా దేవసేనమ్మ మాట్లాడుతూ తాను గూడూరు మున్సిపాలిటీ కి చైర్ పర్సన్గా పని చేశానని ఈ సమయంలో గూడూరు అభివృద్ధికి ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి తనని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్పర్సన్ చేయడం చాలా సంతోషమని తనకు ఇచ్చిన పదవిని ఎంతో బాధ్యతతో చేస్తానని దీనిలో భాగంగా నేను గూడూరుని స్వచ్ఛ గూడూరు గా మార్చే దానికి సంబంధించి అనేక కార్యక్రమాలు చేయవలసి ఉందని కొన్ని ముఖ్యమైనవి డంపింగ్ యార్డు ను అభివృద్ధి పరచడం, ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడం, గూడూరుని స్వచ్ఛ గూడూరు గా మార్చే దానికి తన వంతు సహాయం చేస్తానని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర చైర్పర్సన్ దేవసేనమ్మ తెలియజేశారు.

ముఖ్యంగా ప్లాస్టిక్ ఎవరైనా కలిగి ఉంటే ప్లాస్టిక్ కలిగి ఉన్నవారికన్నా ఆ ప్రాంతంలో ఉన్న శానిటరీ ఉద్యోగులు ఎక్కువ బాధ్యత వహించాల్సి ఉంటుందని దేవసేనమ్మ తెలియజేశారు. గూడూరు శాసనసభ్యులు వి. వరప్రసాద్ మాట్లాడుతూ తాను గూడూరుని ఎంతో అభివృద్ధి చేశానని ఒక ఎమ్మెల్యే గా కాకుండా కూడా ఒక మాజీ ఆఫీసర్గా చేసిన అనుభవం, తాంబరం లాంటి 10 అతిపెద్ద మున్సిపాలిటీల్లో కూడా పనిచేసిన అనుభవం ఉందని అదేవిధంగా గూడూరుని కూడా ఎంతో అభివృద్ధి చేశానని ముఖ్యంగా నాయుడు కాలవ శుభ్రత, గూడూరులో అక్రమ కట్టడాలు నిరోధం చేయడం లాంటి పనులు సచివాలయ సిబ్బంది చూసుకోవాలని ఎమ్మెల్యే వరప్రసాద్ తెలియజేశారు.

## ఘనంగా శరన్నవరాత్రులు

విజయవాడ, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)జయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవాళ్టి నుంచి ఈనెల 15వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగనున్నాయి. తొమ్మిదిరోజులపాటు పది అలంకారాలలో దుర్గమ్మ దర్శనమివ్వనుంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈరోజు దుర్గాదేవి శ్రీ స్వర్ణకవచాలంకృత అలంకారంలో దర్శనమివ్వనున్నారు. ఉదయం స్నపనాభిషేకం అనంతరం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులకు అనుమతి ఇవ్వనున్నారు.ఇంద్రకీలాద్రిపై కోవిడ్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు ఆలయ అధికారులు. ఇందులో భాగంగానే.. రోజుకు పదివేల మంది భక్తులకు మాత్రమే కొండపైకి అనుమతి ఇస్తున్నారు. ఉచిత దర్శనం నాలుగు వేలు, 100 రూపాయల టిక్కెట్ దర్శనం 3 వేల మందికి, 300 రూపాయల టిక్కెట్ దర్శనం మూడు వేల మంది చొప్పున ఆన్లైన్ స్లాట్ ఉన్న వారికి మాత్రమే అమ్మవారి దర్శనానికి అనుమతి ఇస్తున్నారు. వినాయకుడి గుడి నుంచి అమ్మవారి సన్నిధానం వరకు మూడు క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు.

వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయంలో..

ఇక తెలంగాణలోని చారిత్రక వరంగల్లో స్వయం వ్యక్తమైన శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ఇవాళ్టి నుంచి దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యారు. ఈ ఉత్సవాలు 16వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో బాగంగా.. 12వ తేదీన మంగళవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతి పూజ,13వ తేదీన బుధవారం చద్దులబతుకమ్మ, పండుగ రోజు భద్రకాళి అమ్మవారి జన్మదినోత్సవం అయిన 14వ తేదీన మహానవమి మహా పూర్ణాహుతి, 15వ తేదీన విజయదశమి దసరా సందర్భంగా హంసవాహన తెప్పోత్సవం.,16వ తేదీ శనివారం శ్రీ భద్రకాళి భద్రేశుల కల్యాణం నిర్వహించబడుతాయని ఆలయం కార్యనిర్వాహణ అధికారిని రాయల సునీత తెలిపారు.

## 20 వేల కోట్లే ఇస్తాం

విజయవాడ, అక్టోబరు 7, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతోన్న పోలవరం ప్రాజెక్టు నిధులపై మోదీ సర్కారు తేల్చేసింది. దేశంలోని మిగతా ప్రాజెక్టులకు మాదిరిగా పోలవరం ప్రాజెక్టుకు కూడా అదనంగా నిధులు మంజూరు చేయాలని కేంద్ర జల శక్తి శాఖ కోరిన నేపథ్యంలో కొత్త నిర్ణయాన్ని తీసుకుంది. మరో రూ. 4వేల కోట్లను అదనంగా మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖకు, కేంద్ర జలశక్తి శాఖ లేఖ ఇప్పటికే రాసిన సంగతి తెలిసిందే.అయితే, ఆ లేఖను పరిశీలించిన మీదట నిధులు ఇచ్చేది లేదని ఆర్థిక శాఖ తేల్చిచెప్పేసింది. ఆ లేక సమాచారాన్ని కేంద్ర జల శక్తి శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి వివరించింది.కాగా, నిన్న ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కలిసి దీనిపై చర్చించారు. పోలవరం నిధులకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ లేఖపై మంతనాలు జరిపారు. క్యాబినెట్ తీర్మానానికి కట్టుబడి ఉంటామని కేంద్ర ఆర్థిక మంత్రి తేల్చి చెప్పినట్టు తెలుస్తోంది.కాగా, 2017లో కేంద్ర క్యాబినెట్ తీర్మానం మేరకు రూ. 20 వేల కోట్లకు మించి ఇచ్చేది లేదని ఆర్థిక శాఖ స్పష్టం చేస్తూ.. ఈ మేరకు జలశక్తి శాఖకు లేక రాసింది.

## చంద్రబాబు తన రాక్షస మనస్తత్వం మార్చుకోవాలి

### రాష్ట్ర పరిపాలనకు సహకరించాలి

### - డిప్యూటీ సీఎం

చిత్తూరుఅక్టోబరు 7, (న్యూస్ పల్స్) గంగాధర నెల్లూరు నియోజకవర్గం, ఎస్ఆర్ పురం మండలంలోని ఆరిమాకులపల్లిలో వెలసిన ఆరిమాని గంగమ్మ దేవస్థానంలో 17వ సం. దసరా శరవన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం కె. నారాయణస్వామి గురువారం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమణ మరియు వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు డిప్యూటీ సీఎం కు అమ్మవారి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రజలు దసరా ఉత్సవాల పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడుకున్న రాక్షస మనస్తత్వం మారి, అమ్మవారు ఆయనకు కనువిప్పు చేసేలా కటాక్షించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ పూజా కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి, వైసిపి నాయకులు బాలాజీ నాయుడు, జడ్పీటీసీ ప్రసాద్ రెడ్డి, అన్నదానం నిర్వహించే దాత పురుషోత్తం, మనోహర్, వైసిపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## రిమ్స్ ఆక్సిజన్ ప్లాంట్ ను ప్రారంభించిన మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అక్టోబరు 7, (న్యూస్ పల్స్)రిమ్స్ జనరల్ ఆస్పత్రిలో 20 కిలో లీటర్ల (నిమిషానికి వెయ్యి లీటర్ల సామర్థ్యంతో పంపింగ్) ఆక్సిజన్ ప్లాంట్ ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ గురువారం నాడు ప్రారంభించారు. తరువాత రిమ్స్ లో నూతనంగా నిర్మించిన బ్లాకులను కలియ తిరిగి పిడియాట్రిక్స్ (చిన్న పిల్లల) మెడికల్ వార్డ్ (50 పడకలు) ప్రారంభించారు. ఒకవేళ కోవిడ్ థర్డ్ వేవ్ ను ఎదుర్కొనే పరిస్థితి వస్తే సన్నాహక చర్యలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు ధర్మాన ప్రసాద రావు, జిల్లా కలెక్టర్ శ్రీకేస్ బాలాజీ లాటకర్, జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పరశురామ్, అర్ఎంవో డాక్టర్ హేమంత్ తదితరులు పాల్గన్నారు. అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ.. కొవిడ్ కష్టకాలంలో రిమ్స్ అందించిన సేవలు నభూతో న భవిష్యత్. గతంలో కార్పొరేట్ సామాజిక బాధ్యతతో ఎన్ఎస్ఎల్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ప్లాంటును ప్రారంభించాం. ఇప్పుడు పీఎం కేర్స్ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం సౌజన్యంతో 20 కిలో లీటర్ల మరో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాం. ఆక్సిజన్ విషయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో భవిష్యత్తులో కొరత పేరుతో ఇక ఎలాంటి ఇబ్బంది ఉండబోదు. విద్య, వైద్యం విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు మిగిలిన రాష్ట్రాల వారికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.

## టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా జె.రామేశ్వర రావు ప్రమాణస్వీకారం

తిరుమల, అక్టోబరు 07 టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా జె.రామేశ్వర రావు గురువారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి జె.రామేశ్వర రావుచే ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేశారు. అనంతరం అదనపు ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం, కాఫీ టేబుల్ బుక్కు అందించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవోలు రమేష్ బాబు, సుధారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో ప్రయివేట్ ఆస్పత్రి నిర్లక్షానికి నిండుప్రాణం బలి

కుప్పం అక్టోబరు 7, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా కుప్పం పైభాట కి చెందిన వెంకటరమణ భార్య గంగ కి బుధవారం సాయంత్రం కడుపు నొప్పిఎక్కువగా ఉండటంతో కుప్పం కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి అదుపులోనే ఉందని చెప్తువచ్చిన డాక్టర్లు పరిస్థితి చేయిదాటిపోయిన తరువాత వేరే ఆసుపత్రికి తీసుకెళ్ళందని సలహా ఇచ్చారు. వారు ఆమెను హుటాహుటిన పీఈఎస్ కు తరలించేందుకు ప్రయత్నించగా అంబులెన్స్ లో పెట్రోల్ లేదని సమాధానం ఇచ్చారు. అయితే ఎలాగోలా అంబులెన్స్ లో జూవబ కి తరలించే లోపు మహిళ మరణించిందని 10 నిముషాలు ముందు తీసుకొని వచ్చి ఉంటే మహిళ ప్రాణాలు మిగిలేవని డాక్టర్లు చెప్పారని బాధితులు అంటున్నారు.. కాగా నిండు ప్రాణం పోవడానికి కుప్పం కేర్ ఆసుపత్రి యాజమాన్యమే కారణమని భాదితులు ఆరోపిస్తూ మృతదేహంతో రోడ్డుపై బైఠాయించారు. ఉదయం నుంచి ఆసుపత్రి ఎదుటే రోడ్డుకు అడ్డంగా శవాన్ని ఉంచి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుపోగా పోలీసుల సహాయంతో తమను బెదిరిస్తున్నారని వాపోయారు. ఆసుపత్రి ఎదుట శవంతో ఉదయం నుండి రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని నిరసన చేస్తున్న భాదితులకు ఇప్పటివరకు ఆసుపత్రి యాజమాన్యం స్పందించలేదని ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం జరిగేవారకు శవాన్ని తీసేలేదని ఇక్కడినుంచి కదలమని బాధితులు భీష్మించుకుని కూర్చున్నారు.

## భార్య పోరాటం

శ్రీకాళాహస్తి అక్టోబరు 7, (న్యూస్ పల్స్) శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్ట ప్రాంతానికి చెందిన తేజస్విని అనే మహిళ తన భర్త తనకు కావాలి అంటూ భర్త ఇంటిముందు బైఠాయించిన వైనం శ్రీకాళహస్తి పట్టణంలోని ని బజార్ వీధి లో చోటుచేసుకుంది . కాళహస్తి పట్టణంలోని కొండమిట్ట ప్రాంతానికి చెందిన డాక్టర్ తేజస్విని, డాక్టర్ విక్రమ్ రావ్ లు 2016 లో వివాహం చేసుకునక్నారు. వీరికి గౌతంరావ్ అనే కుమారుడు జన్మించాడు. తరువాత విక్రమ్ రావ్ తల్లి వరకట్నం కావాలి అంటు తేజస్విని వేధింపులకు గురి చేసింది. వరకట్నం తీసుకురమ్మని ఇంటి నుంచి బయటకు పంపించి వేయడంతో తనకు న్యాయం చేయమంటూ తేజస్విని తన కుమారునితో రోడ్డుపై బైఠాయించింది. కన్నీరుమున్నీరుగా తన ఆవేదన వ్యక్తం చేసింది. తేజస్విని మాట్లాడుతూ తన భర్త కుటుంబ సభ్యులు తనను వరకట్నం తీసుకురమ్మని వేధింపులకు గురిచేసి తనను ఇంటి నుంచి బయటికి తరిమి వేశారని, తనకు న్యాయం చేయమంటూ బాధితురాలు తన కుమారునితో కన్నీరుమున్నీరవుతుంది.

# ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలో గల నివాస గృహములు (300 చ.గజాల) వరకు క్రమబద్ధీకరణ

నంద్యాల, అక్టోబర్ 07 ( విభారె) ఆక్షేపణలేని ప్రభుత్వ భూముల్లో 15-10-2019 తేదీ నాటికి ఆక్రమణలో గల నివాస గృహములు (300 చ.గజాల) వరకు క్రమబద్ధీకరించబడునని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నంద్యా సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు .225 తేది : 23.08.2021 ఉత్తర్వులు జారీ చేసిందని, కావున ప్రభుత్వం వారు పొందుపరచిన షరతుల దృష్ట్యా అర్హులైన వారు " సచివాలయం / వార్డు " కేంద్రాల ద్వారా వారి వివరాలను పొందుపరచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారము క్రింద కనబరచిన ప్రకారము ఆక్షేపణలేని ప్రభుత్వ భూముల్లో అక్రమాలను క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. 75 చదరపు గజాల విస్తీర్ణం వరకు : (కేటాయించుటకు చెల్లించాల్సిన ధర) భూమి యొక్క ప్రాథమిక విలువలో 75 శాతం, కుటుంబం కేటగిరీ-1 కి చెందినది మరియు డి ఫారం పట్టాను ఉచితంగా పొందాలనే ఉద్దేశంతో ఆరు దశల ధ్రువీకరణ అర్హత పొందినట్లయితే, ఆమెరకు డి ఫారం పట్టా జారీ చేయబడుతుందన్నారు .150 చదరపు గజాల విస్తీర్ణం వరకు : (కేటాయించుటకు చెల్లించాల్సిన ధర) భూమి యొక్క ప్రాథమిక విలువలో 75 శాతం. 150+300 చదరపు గజాల విస్తీర్ణం వరకు : (కేటాయించుటకు చెల్లించాల్సిన ధర) భూమి యొక్క ప్రాథమిక విలువలో 100 శాతం .కేటగిరి 1 : (గ్రామీణ ప్రాంతము 1)సదరు ఆక్రమణ దారు కుటుంబము నెలసరి ఆదాయము అన్ని వనరుల నుండి రూ. 10,000/- అనగా సంవత్సరమునకు రూ. 1,20,000/- ఆదాయం కలిగి ఉండాలి. 2)10 ఎకరముల మెట్ట భూమి లేదా 3 ఎకరముల తరి భూమి లేదా మెట్ట భూమి మరియు తరి

### ఈ ఏడాది డిసెంబర్ 31 లోగా సచివాలయం/వార్డు కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలి నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

భూమి కలిపి 10 ఎకరముల భూమి వరకు సదరు కుటుంబము కలిగి ఉండవచ్చును. 3)సదరు కుటుంబము నందు ఆదాయపు పన్ను కట్టు సభ్యులు ఉండరాదు. 4)సదరు కుటుంబమునకు 4 చక్రముల వాహనము ఉండరాదు. కాని కుటుంబమునకు టాక్సీ, ఆటో, ట్రాక్టర్ వ్యవసాయమునకు ఉన్నచో మినహాయింపు గలదు. కేటగిరి 1 : పట్టణ ప్రాంతము :-1)సదరు ఆక్రమణ దారు కుటుంబము నెలసరి ఆదాయము అన్ని వనరుల నుండి రూ. 12000/- అనగా సంవత్సరమునకు రూ. 1,44,000/ - వరకు ఉండవచ్చును. 2)సదరు కుటుంబము నందు ప్రభుత్వ ఉద్యోగం చేయు సభ్యులు ఉండరాదు. ఐతే కాంట్రాక్టు ఉద్యోగం చేయు వారు ఉండవచ్చును. 3)సదరు కుటుంబము నందు ఆదాయపు పన్ను కట్టు సభ్యులు ఉండరాదు. 4)సదరు కుటుంబమునకు 4 చక్రముల వాహనము ఉండరాదు. కానీ కుటుంబమునకు టాక్సీ, ఆటో, ట్రాక్టర్ వ్యవసాయమునకు ఉన్నచో మినహాయింపు గలదు. ఇందుకు సంబందించిన దరఖాస్తులను సంబంధిత సచివాలయం/వార్డు కార్యాలయము 31-12-2021 లోగా సమర్పించాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. అట్లు సమర్పించని యడల రెవిన్యూ అధికారులు సదరు ఆక్రమణను తొలగించుటకు చట్ట ప్రకారము చర్యలు తీసుకుంటారని సబ్ కలెక్టర్ తెలియజేశారు.

## హమాలీల కడుపు కొట్టవద్దు. దూరం పెరిగే కొద్దీ అదనపు భారం పడు తుంది

### మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల అక్టోబర్ 07 ( విభారె) నంద్యాల పట్టణంలో గురువారం నాడు కేంద్ర గిడ్డంగుల వద్ద నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు తెలుగుదేశం పార్టీ మాజీ యమ్ యల్ ఏ భూమ బ్రహ్మానందరెడ్డి మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ . కేంద్ర గిడ్డంగుల సంస్థ లొ నిల్వ వుంచ వలసిన బియ్యం రాష్ట్ర ప్రభుత్వం గొపవరం వద్ద ప్రవేటు గిండ్డంగి బాడుగకు తీసుకొని నిల్వ చేస్తున్నారని విమర్శించారు . అందువలన కేంద్ర గిడ్డంగుల సంస్థ లొ హమాలిలకు ఉపాది పోతుందని అన్నారు. రైల్వే స్టెషను నుండి బియ్యం గోపవరం గిడ్డంగు కు. అక్కడ నుండి డీలరు వద్దకు తోలథం వలన అదనంగా దూరం పెరగడంతో వినియెగ దారులకు అదనంగా బారం పడుతుందని అన్నారు . ఈ విషయం పై తెలుగు దేశం పార్టీ తరపున మాజి శాసన సభ్యుదు భూమా బ్రంహ్మానంద రెడ్డి హమాలీలకు సంఘిబావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం సరపరా చేసె బియ్యం ప్రభుత్వ సంస్థ అయిన కేంద్ర గిడ్డంగుల సంస్థ లోనె నిల్వ ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

### సీపీఐ డిమాండ్

పాములపాడు అక్టోబర్ 07 ( విభారె)నందికొట్కూరు నియోజకవర్గం లోని ఆరు మండల కేంద్రంలో ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ తాలూకా కార్యదర్శి ఎం.రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పాములపాడు మండల కేంద్రంలోని మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో నందికొట్కూరు నియోజకవర్గంలో దాదాపు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని అయితే పంట చేతికి వచ్చి 15 రోజులు గడుస్తున్నా ఇంతవరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల దళారులను ఆశ్రయించి రైతుల మోసపోతున్నారు అని వారన్నారు. అందులో భాగంగా మరో రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలపడం వల్ల రైతులు పండించిన పంట తడిస్తే ధాన్యాన్ని ఎవరూ కొనుగోలు చేస్తారో లేదో అని దిగాలుగా రైతు ఆలోచన చేస్తున్నారని వారన్నారు. రైతు పంటను అనేక కష్టనష్టాలతో పెరిగిన కూలీల వల్ల అదేవిధంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరగడం ఈ అన్నిటినీ భరించి రైతు పంట పండిస్తే రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ గారు, స్పందించి ప్రతి మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

# పంచదార కంటే బెల్లం మేలు



ఇవి చెరుకు పండే రోజులు. షాపింగ్‌మాల్స్‌లో కూడా చెరుకు ముక్కలు ప్యాక్ చేసి అమ్ముతున్నారు. ఈ చెరుకు గడ్డల నుంచి తయారయ్యే బెల్లం భారతీయుల జీవనశైలిలోనే ఒక భాగం. వంటల్లో, పెళ్లిళ్లు, పేరంటాల్లో, వేడుకల్లో బెల్లం వినియోగానికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. పంచదారలో మాత్రమే రసాయనాలు, అధిక క్యాలరీతో తియ్యదనం ఉంటుంది. కానీ బెల్లంలో విటమిన్లు, ఖనిజాలు ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పాకశాస్త్ర ప్రవీణులు బెల్లంతో తయారు చేసే రిజర్వ్‌లకే ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీన్ని లిక్విడ్ గోల్డ్ అని ద్రవరూపంలోని బంగారం అనీ అత్యంత శుద్ధమైన తీపి పదార్థమని అంటారు. చక్కని సువాసన బంగారం రంగులో, బెల్లంతో తయారు చేసిన కేకులు, మిఠాయిలు ఆరోగ్యానికి మంచిదంటారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రాంతాల్లో సాస్‌లు, జామ్‌లు, కేకులు, స్వీట్లు ఇప్పుడు బెల్లంతో చేస్తున్నారు. తాటిబెల్లంతో కేక్స్, హల్వా, పండ్లతో చేసే పేల్‌ఆల్, గూడ్‌కీ ఖీర్ వంటి అదుతేమైన వంటకాల్లో బెల్లం వాడకం మొదలైంది. బెల్లాన్ని కరిగించిన లేత పాకాన్ని కస్టర్డ్‌లు, ఐస్‌క్రీమ్‌ల పైన నింపి అందిస్తున్నారు. బెల్లాన్ని చెరుకు రసం నుంచి ఎలాంటి ప్రక్రియలు లేకుండా సహజసిద్ధంగా తయారు చేస్తారు. ఖర్జూరం, తాటిచెట్లు, కొబ్బరి నుంచి కూడా బెల్లం తయారవుతుంది. కొన్ని ఫ్యాక్టరీలో తయారు చేసే తేనెల కంటే బెల్లంతో చేసే సిరప్ ఉత్తమం అంటున్నారు చెఫ్‌లు. అసలైన బెల్లం ముదురు గోధుమ రంగులో ఉంటుంది. పసుపు రంగులో మెరుస్తూ కనిపిస్తే దానికి రసాయనాలు కలిశాయని అర్థం చేసుకోవాలి. బెల్లంలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. రక్తకణాలకు ఆక్సిజన్ సరఫరా చేసే ఎర్ర రక్తకణాలు ఐరన్ పాత్ర చాలా ముఖ్యమైంది.ప్రతిరోజూ చిన్న బెల్లం ముక్క తిన్నా, ఎర్రరక్త కణాలకు ఐరన్ అందుతుంది. రక్తహీనతతో బాధపడే వారికి బెల్లం వల్ల ఎంతో ప్రయోజనం సమకూరుతుంది. ఇందులో ఎన్నో పోషకాలున్నాయి. ఎన్నో విటమిన్లు, ఫాస్ఫరస్, ఐరన్, మెగ్నీషియం, పోటాషియం వంటి పోషకాలు ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది మేలైన డిటాక్సిన్. జింక్, సెలీనియం వంటి ఖనిజాలు ఉండటం వల్ల శరీరంలోని వివిధ అవయవాల ద్వారా టాక్సిన్‌లను బయటకు పంపేస్తుంది. దీనితో చర్మం ఆరోగ్యంగా కాంతివంతంగా ఉంటుంది. నిత్యం సరైన పరిమాణంలో బెల్లం తీసుకుంటే పొట్ట ప్రాంతంలో అదనపు క్యాలరీలు కరిగిపోతాయి. జీర? ప్రక్రియను వేగవంతం చేస్తుంది. మధుమేహం ఉన్నవారు కొద్ది పరిమాణంలో బెల్లం తీసుకుంటే ప్రమాదం ఏమీ ఉండదు. అందుకే పంచదారకు బదులు బెల్లం వాడమంటారు వైద్యులు. గ్లైకమిక్ ఇండెక్స్ ప్రకారం పంచదార కంటే బెల్లం మేలు. కాబట్టి పిల్లలకు బెల్లంతో చేసిన వేరుశనగ ఉండలు, జీడిపప్పు ఉండలు ఇవ్వచ్చు. అధిక పోషకాలతో నిండిన బెల్లం ఆరోగ్యపరంగా ఎంతో మంచిది.

# భారత్- ఆస్ట్రేలియా తొలి టీ20 మ్యాచ్ రద్దు..




భారత్, ఆస్ట్రేలియా మహిళల మధ్య జరుగుతున్న తొలి టీ20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కి వచ్చిన భారత్ 15.2 ఓవర్లలో 134/4 పటిష్ట స్థితిలో ఉన్న సమయంలో వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను తాత్కాలింగా నిలిపివేశారు. తరువాత దాదాపు గంట సమయం ఎదురు చూసిన అంపైర్స్ .. వర్షం ఎప్పటికీ ఆగిపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. కాగా భారత్‌కు ఓపెనర్లు షఫాలి వర్మ(17), స్మృతి మంధన(18) శుభారంభాన్ని ఇచ్చారు. జెమిమా రోడ్రిగ్స్ 49 పరుగులచేసి అత్యధిక స్కోరర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా బౌలర్లలో యాష్లే గార్డనర్ రెండు వికెట్లు పడగొట్టగా, సోఫీ మోలినెక్స్, జార్జియా వారెహామ్ చెరో వికెట్ సాధించారు. దాదాపు గంట సమయం ఎదురు చూసిన అంపైర్స్ .. వర్షం ఆగిపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య శనివారం రెండో టీ20 జరగనుంది.

### ఇంగ్లండ్ జట్టుకు భారీ షాక్.. చారిత్రక సిరీస్‌కు స్టార్ ఆల్‌రౌండర్ దూరం

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ చేతి వేలికి మరో సర్జరీ జరగడంతో యాషెస్ సిరీస్ నుంచి తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది భారత్‌లో జరిగిన ఐపీఎల్-2021 తొలి దశ సందర్భంగా స్టోక్స్ గాయపడ్డాడు. ఆ సమయంలో అతను గాయానికి సర్జరీ చేయించుకున్నాడు. అయితే తాజాగా అదే చేతి వేలికి మరో సర్జరీ జరగడంతో అతను యాషెస్ నుంచి తప్పుకుంటాడని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతానికి స్టోక్స్ పూర్తి ఫిట్‌గా ఉన్నా.. ఇప్పట్లో క్రికెట్ ఆడే అవకాశం మాత్రం లేదని ఓ నివేదిక వెల్లడించింది. ఈ విషయాన్ని స్టోక్స్ సైతం సూచనప్రాయంగా అంగీకరించాడు.

# ఐటమ్ సాంగ్ కోసం 2కోట్లు డిమాండ్ చేసిన హాట్



ఐటమ్ పాటల స్పెషలిస్ట్ నోరా ఫతేహి ఒక్కో ఐటమ్ నంబర్ కి ఎంత పారితోషికం తీసుకుంటుంది? అంటే.. ఇంతకుముందు లక్షల్లో పారితోషికం సరిపోతుందని టాక్ వినిపించేది. కానీ ఇప్పుడు నోరా డిమాండ్ గురించి తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే.'పుష్ప' చిత్రంలో అదిరిపోయే ఐటమ్ నంబర్ కోసం పలువురు భామల పేర్లను పరిశీలించి సుకుమార్ అండ్ టీమ్ సంప్రదించింది. దిశా పటానీ- సన్నీలియోన్ - జాక్వెలిన్ ఫెర్నాండెజ్ -పూజా హెగ్డే- కత్రిన కైఫ్ అంటూ కొన్ని పేర్లు ప్రముఖంగా వినిపించాయి.కానీ వీరంతా రకరకాల కారణాలతో ఐటమ్ నంబర్ కి సంతకం చేయలేదు. కానీ ఇప్పుడు బాహుబలి మనోహరిని ఈ విషయంపై సంప్రదించిన పుష్ప టీమ్ కి ఊహించని షాక్ తగిలిందని తెలిసింది. నోరా ఐదు నిమిషాల ఐటమ్ నంబర్ కోసం ఏకంగా 2 కోట్ల పారితోషికం అడిగిందట. ఈ పాటను కేవలం మూడు నాలుగు రోజుల్లో మాత్రమే తెరకెక్కిస్తారు. అయినా ఇంతకుముందు ఎన్టీఆర్ టెంపర్ లో ఐటమ్ నంబర్ కోసం కేవలం 5లక్షలు మాత్రమే అందుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు ఆ రేంజులో డిమాండ్ చేస్తోందా? అంటూ అంతా షాక్ తింటున్నారు. కిక్ 2 - బాహుబలి చిత్రాల్లో ఐటమ్ నంబర్ కోసం లక్షల్లోనే పారితోషికం అందుకుంది. కానీ ఇప్పుడు ఊహించని విధంగా 2కోట్లు డిమాండ్ చేయడం షాక్ కి గురి చేస్తోంది.అయితే ఐటమ్ పాటల స్పెషలిస్టుగా నోరా ఫతేహికి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. లక్షల్లో వీక్షకులు ఇన్‌స్టా మాధ్యమంగా నోరాను అనుసరిస్తున్నారు. అనేక బాలీవుడ్ సినిమాలలో రెండవ లీడ్ రేంజుకు ఎదిగిన ఈ బ్యూటీ సుకుమార్ క్యాంప్ నుండి వచ్చిన పిలుపును అందుకుని 2 కోట్లు కోట్ చేసినట్లు చెబుతున్నారు. నోరా ఫతేహి ఉనికి హిందీ మార్కెట్ లో కూడా సహాయపడుతుందనే ఆసక్తి ఉన్నా కానీ అంత పెద్ద మొత్తం చెల్లించడం అంటే ఆషామాషీ కాదన్న టాక్ వినిపిస్తోంది. ఇంకా నోరాను ఫైనల్ చేయాల్సి ఉందని తెలిసింది.

# 'మహా సముద్రం' గురించి మ్యూజిక్ డైరెక్టర్ చెప్పిన సంగతులు..!

వర్సటైల్ యాక్టర్స్ శర్వానంద్ - సిద్ధార్థ్ హీరోలుగా 'ఖీలీ100' ఫేమ్ అజయ్ భూపతి విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం "మహా సముద్రం". ఇందులో అదితిరావు హైదరి - అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇన్టెన్స్ లవ్ ఓ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రాన్ని ఎ.కె.ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సుంకర రామబ్రహ్మం నిర్మిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 14న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ శరవేగంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..- 'మహా సముద్రం' ఎంతో ఇంటెన్స్ ఎమోషన్స్ ఉన్న సినిమా. ఈ చిత్రం చూసిన ప్రేక్షకులు కచ్చితంగా ఓ మౌనంతో వెళ్తారు. చివరి 40 నిమిషాలు మాత్రం ఎవ్వరూ ఏం మాట్లాడకుండా చూస్తారు. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకంతో ఉన్నాం.- మనిషి జీవితంలో ఎలాంటి మార్పులు వస్తాయో అదే 'మహాసముద్రం'. అమాయకపు మనుషుల జీవిత కథలే ఇందులో కనిపిస్తాయి. ఇలాంటి ఇంటెన్స్ ఎమోషన్స్ ఉన్న సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇవ్వడం నాకు చాలెంజింగ్ గా అనిపించింది. ఎన్ని రకాలుగా ఇవ్వొచ్చనే విషయం కూడా తెలిసింది. అందరి అంచనాలు మించేలా ఈ సినిమా ఉంటుంది.- మ్యూజిక్ అనేది కథకు అనుగుణంగానే ఇస్తాను. కథ బాగుంటే.. మ్యూజిక్ కూడా బాగుంటుంది. కథను బట్టే మ్యూజిక్ ఇవ్వడానికి నేను ఎక్కువగా ఇస్తుంటాను.- 'ఆర్ఎక్స్ 100' సినిమాలో కంటే ఎక్కువ ట్విస్ట్ లు 'మహాసముద్రం' లో ఉంటాయి. ఇందులో దాదాపు ఐదారు ట్విస్టు ఉంటాయి. అందులో ఒకే ఎమోషన్ ఉంటుంది.. కానీ ఇందులో మల్టిపుల్ ఎమోషన్స్ ఉంటాయి. ఒక అతీంద్రియ శక్తి మనిషిని ఎన్నిరకాలుగా మార్చుతుంది.. కాలం - విధి మనిషిని ఎన్ని రకాలుగా మార్చుతుందనేది ఇందులో చూపించబోతోన్నాం.- 'ఆర్ఎక్స్ 100' సినిమాకు చేసిన ప్రయోగాన్ని ప్రేక్షకులు రిసీవ్ చేసుకున్నారు. బాగా ఆదరించారు. ఇప్పుడు ఈ సినిమాకు ఒళ్లు దగ్గరపెట్టుకుని మరింత జాగ్రత్తగా చేశాను. కచ్చితంగా 'మహాసముద్రం' కూడా అందరినీ ఆకట్టుకుంటుంది. మహా అనే క్యారెక్టర్ చాలా ఇంటెన్స్ గా ఉంటుంది. ఆమె జీవితంలో జరిగే ఘటనల ద్వారా చుట్టూ ఉన్న వారికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనేది ఈ కథ.- కొన్ని కొన్ని జానర్స్ మూవీ సెంట్రిక్ గా చేయాల్సి ఉంటుంది. మూవీకి ఆ పర్టిక్యులర్ సీన్ కు పాట ఆడియెన్స్ కు కనెక్ట్ అయితే.. ఆ పాట హిట్టైనట్టే. 'ఆర్ఎక్స్ 100' సినిమా అనేది ఎమోషన్స్ లవ్ యాక్షన్ అన్ని కలిపి ఉంటాయి. ఆ సినిమాలోని పాటలు ఆడియెన్స్ ను కనెక్ట్ అయ్యాయి. ఆ సెక్షన్ ఆడియెన్స్ కు కనెక్ట్ అయ్యాయంటే హిట్ అయినట్టే. 'మహా సముద్రం' సినిమాలో నాకు 'చెప్పకే చెప్పకే' అనే పాట ఎక్కువగా ఇష్టం. మంచి మూమెంట్ లో ఆ పాట వస్తుంది. 'హే రంభా' పాట పాడటం నాకు సంతోషంగా అనిపించింది.- నాకు కథను ఎంతో క్లియర్ గా డీటైల్డ్ గా చెప్పారు. నా టోన్ ఆ స్టోరీకి సరిపోతుందని అజయ్ భూపతి గారు నమ్మారు. లైవ్ బేస్డ్ ఎలిమెంట్స్ చేసే స్కోప్ ఇచ్చారు. నాకు డీటైల్డ్ ఎమోషన్ కనుక్కొని మ్యూజిక్ ఇవ్వడం ఇష్టం. అందుకే నేను చేసిన ప్రతీ అటెంప్ట్ పాజిటివ్ గానే తీసుకున్నారు.- ప్రతీ ఒక్కరూ అద్భుతంగా నటించేశారు. అంత ఇంటెన్స్ ఉన్న సినిమాను ఈ మధ్య కాలంలో చూసి ఉండరు. ప్రతీ ఒక్క పాత్రకు ఇంపార్టెన్స్ ఉంటుంది. ఈ చిత్రానికి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేయడం చాలా కష్టంగా అనిపించినా.. చాలెంజింగ్ గా తీసుకున్నాను.- పాటను జనాలకు రీచ్ అయ్యేట్టుగా సంగీతం ఇవ్వాల్సి ఉంటుంది. కథను తగ్గట్టుగానూ ఉండాలి.




# సమంతకు ఆఫర్ల వెల్లువ... ?

టాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారిన సమంత నాగ చైతన్య విడాకుల వ్యవహారం ఇంకా అలాగే కంటిన్యూ అవుతోంది. ఆ ఇద్దరూ ఎందుకు విడిపోయారు కారణాలు ఏంటి అంటూ మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో అతి పెద్ద రిసెర్చ్ సాగుతూనే ఉంది. గాంధీ జయంత్రి రోజున సైలెంట్ గా బాంబు పేల్చినట్లుగా ట్విట్టర్ వేదికగా ఈ స్టార్ కంపుల్ తాము విడిపోతున్నట్లుగా చెప్పేసి ఊరుకున్నారు. ఆ తరువాత రచ్చ అంతా ఇంతా కాదు ఎవరికి తోచిన విధంగా వారు వ్యాఖ్యానాలు చేసుకుంటూ పోతున్నారు. ఎవరిది తప్పు ఎవరిది ఒప్పు అన్న ఇష్యూతో అతి పెద్ద డిబేట్ కూడా చేస్తున్నారు.ఇవన్నీ ఇలా ఉండగానే సమంత చైతూ తమ పనుల్లో తాము బిజీ అయిపోతున్నారు. ఎవరి ఫ్యూచర్ కోర్స్ ఆఫ్ యాక్షన్ మీద వారికి పక్కా క్లారిటీ ఉంది. సమంత బాలీవుడ్ లో సెటిల్ అవుతుంది అని అందరూ ఊహిస్తున్నా ఆమె తనను ఇంతలా పెంచి పోషించిన టాలీవుడ్ ని వీడిపోదు అన్న మాట కూడా వినిపిస్తోంది. నానక్ రాం గూడాలో ఒక అతి ఖరీదైన అపార్ట్మెంట్ లో సమంత ఇక పైన నివాసం ఉంటూ టాలీవుడ్ మీద ఒక కన్నేసి ఉంచుతారు అంటున్నారు.ఆమె ఇపుడు ఏమీ ఖాళీగా లేదు ఒక వైపు యాడ్స్ చేస్తూ బిజీగా ఉంది. అదే టైం లో ఆమె బాలీవుడ్ లో మూవీస్ మీద డిస్కషన్ చేస్తోందిట. ఇక టాలీవుడ్ లో గుణశేఖర్ మూవీ శాకుంతలం రిలీజ్ కి రెడీగా ఉంది. ఆ తరువాత ఆమె మరిన్ని సినిమాలు తెలుగులో చేసే అవకాశం ఉంది అంటున్నారు. ఆమెకు కథలు వినిపించేందుకు కూడా కొందరు నిర్మాతలు సిద్ధంగా ఉన్నారని టాక్. అలాగే సమంతకు సరిపోయే స్క్రిప్టులను తయారు చేసే పనిలో రచయితలూ ఉన్నారుట. సమంత ఈ మధ్యన ట్విట్టర్ వేదికగా ఒక మాట చెప్పింది. తాను హైదరాబాద్ లోనే ఉంటాను అని. దానికి తగినట్లుగానే ఆమె తన కెరీర్ ని డిజైన్ చేసుకుంటోంది అంటున్నారు. సమంత ఓకే అంటే ఆమెతో సినిమాలు చేసేందుకు కూడా చాలా మంది మేకర్స్ రెడీగా ఉన్నారని టాక్. మొత్తానికి సమంత టాలీవుడ్ లో ఇక మీదట ఏ ఏ జానర్లలో మూవీస్ చేస్తుంది. ఏంటి అన్నదే చర్చగా ఉంది మరి. చూడాలి.



# నయా సంచలనం ఉమ్రాన్‌పై హోల్డర్ ప్రశంసలు




ఐపీఎల్-2021 రెండో అంచెలో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్ నటరాజన్ కోవిడ్ బారిన పడటంతో జట్టులోకి వచ్చాడు ఉమ్రాన్ మాలిక్. ఇటీవల కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో అరంగేట్ర మ్యాచ్ ఆడిన ఈ జమ్మూ కశ్మీర్ ఫాస్ట్ బౌలర్... ఈ సీజన్‌లోనే అత్యంత వేగవంతంగా(సుమారు గంటకు 153 కి.మీ.) బంతిని విసిరాడు. ఐపీఎల్-2021లో ఇప్పటి వరకు భారత్ తరఫున ఫాస్టెస్ట్ డెలివరీ చేసిన బౌలర్‌గా నిలిచి.. క్రీడా పండితుల దృష్టిని ఆకర్షించాడు. ఇక రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీకర్ భరత్(12)ను అవుట్ చేయడం ద్వారా.. క్యాష్ రిచ్ లీగ్‌లో తన తొలి వికెట్ నమోదు చేశాడు. 4 ఓవర్లు వేసిన ఉమ్రాన్.. 21 పరుగులు మాత్రమే ఇచ్చి సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో ఎస్ఆర్‌హెచ్ ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్ నయా పేస్ సంచలనం ఉమ్రాన్ మాలిక్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఉమ్రాన్ రాకతో తమ జట్టులో పేస్ విభాగం మరింత బలపడిందని.. నెట్స్‌లో పదునైన బంతులతో తమను బాగా ఇబ్బంది పెట్టినట్లు పేర్కొన్నాడు. "ప్రాక్టీసులో మాకు సవాలుగా నిలిచాడు. వేగంగా బంతులు విసరగలడు. ఎక్స్‌ట్రా పేస్ అనేది ఏ బౌలర్‌కైనా అదనపు బలం. అంతేకాదు.. ఎంత వేగంగా బంతిని విసిరినా అతడు నియంత్రణ కోల్పోడు. గత కొన్నేళ్లుగా ఎంతో మంది పేసర్లు వచ్చారు. కానీ... వారిలో చాలా మంది నిలకడలేమి ఆటతో ఇబ్బంది పడుతున్నారు. అయితే, ఉమ్రాన్ మాత్రం కాస్త భిన్నంగా కనిపిస్తున్నాడు. తను కచ్చితంగా మెరుగ్గా రాణించగలడు" అని సహచర ఆటగాడిపై హోల్డర్ ప్రశంసలు కురిపించాడు. ఇక ఆర్సీబీతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 4 పరుగుల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే. రైజర్స్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఇక జేసన్ హోల్డర్ విషయానికొస్తే... ఈ మ్యాచ్‌లో 16 పరుగులు చేయడం సహా.. ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**